



సహకారం.. ప్రక్షాళన

- ఐదేళ్లలో పూర్తిగా నిర్వీర్యమయిన సహకార సంఘాల సొసైటీలు
- వైసీపీ నాయకుల కనుసన్నల్లోనే రుణాలు
- త్రీమెన్ కమిటీలను రాజకీయ పునరావాసాలుగా మార్చిన వైనం
- వాటి రద్దుకు కొత్త ప్రభుత్వం ఆదేశాలు
- పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ఐదేళ్ల పాటు పీఏసీఎస్‌లన్నీ వైసీపీ నేతల కబంధ హస్తాల్లో ఉండిపోయాయి. ఎన్నికల ఊసే లేకుండా త్రీమెన్ కమిటీల పేరిట నామినేటెడ్ పోస్టుల్లో వైసీపీ నేతాగణాన్ని కూర్చోబెట్టి సహకార సంఘాల ఉద్దేశాన్నే దెబ్బతీసే విధంగా వ్యవహరించారు. రైతులకు రుణాలు ఇవ్వకుండా వారికి నచ్చిన వారికే సొసైటీ రుణాలు అందే విధంగా చూశారు. అభ్యంతరం తెలిపిన ఉద్యోగులను కూడా ఇష్టారీతిన బదిలీ చేసి తమ పబ్బాన్ని గడుపుకున్నారు. ఏటా జరిపే ఆడిట్‌లో అక్రమాలు వెలుగు చూస్తున్నప్పటికీ ఆ నివేదికలను సైతం బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కోట్ల రూపాయలు పక్కదారి పట్టినా రికవరీ ఊసే లేకుండా పోయింది. ఒక్కమాటలో చెప్పాలంటే సహకార సంఘాల రుణాల పేరిట వైసీపీ నేతలు పెద్ద ఎత్తున లబ్ధి పొంది అర్హులైన రైతుల నోట్లో మట్టి కొట్టారు.

బాపట్ల, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు దీరగానే ఈ సహకార సంఘాల ప్రక్షాళనపై దృష్టి పెట్టింది. పీఏసీఎస్(ప్రైమరీ అగ్రికల్చరల్‌క్రెడిట్ సొసైటీ)లో కొనసాగుతున్న త్రీమెన్ కమిటీలను వెంటనే రద్దు చేస్తున్నట్లు ఆదేశాలిచ్చింది. రాజీనామాకు కొంతమంది వైసీపీ నేతలు ససేమిరా అన్నప్పటికీ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం సాంకేతికంగా వారు పదవుల్లో లేనట్లే. ఆయా సొసైటీల్లో పర్సన్ ఇన్ చార్జిల నియామకానికి సహకార శాఖ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. త్వరలోనే వారి నియామకం జరగనుంది.

2018లోనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా..

సహకార సంఘాలకు చివరిసారి ఎన్నికలు 2013లో జరిగాయి. షెడ్యూల్ ప్రకారం 2018లో నిర్వహించాల్సి ఉంది. అప్పట్లో సొసైటీల పాలకవర్గాన్ని ఏడాది కాలం పాటు పొడిగిస్తూ ఉత్తర్వులిచ్చారు. 2019లో వైసీపీ ప్రభుత్వం గద్దెనెక్కగానే ఎన్నికల సంప్రదాయానికి తిలోదకాలిస్తూ సెవన్‌మెన్ కమిటీ, త్రీమెన్ కమిటీలపేరిట వైసీపీ నేతలను సొసైటీల్లోని పదవుల్లో నామినేటెడ్ ప్రాతిపదికన నియమిస్తూ వచ్చింది. ఆరునెలల కొకసారి వారి పదవీకాలం పొడిగించుకుంటూ వచ్చింది తప్పితే సొసైటీలకు ఎన్నికలు జరిపి పాలకవర్గాలను నియమించే ప్రయత్నం చేయలేదు. మధ్యలో ఒకట్రెండు సార్లు సహకార సంఘాలకు ఎన్నికలంటూ హడావిడి చేసి ఓటరు జాబితాలను కూడా సిద్ధం చేశారు. తర్వాత వాటిని పట్టించుకున్న పాపాన వైసీపీ పోలేదు.

ఐదేళ్లలో అనేక అక్రమాలు..

వైసీపీ నేతాగణమే సొసైటీ పదవుల్లో ఉండడంతో రుణాల విషయంలో అనేక అక్రమాలకు వారు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పంగులూరు మండలం నూజెళ్లపల్లి సొసైటీలో లాకర్‌లో బంగారం లేకుండానే రైతుల పేరిట వైసీపీ నేతలే రూ.2.20 కోట్ల రుణాలు పొందిన బాగోతం గతంలో వెలుగు చూసింది. అది బయటపడడంతో అధికారుల హడావిడి తప్పితే రికవరీ మాటేలేదు. డీసీసీబీల పరిధిలో కొందరు బ్యాంకు అధికారులు, వైసీపీ నేతలు కుమ్మక్కై కోట్ల రూపాయల రుణాలను నకిలీ పట్టాదారు పాసు పుస్తకాలతో రుణాలు పొందారన్న ఆరోపణలు గతంలో వచ్చాయి. ఉమ్మడి గుంటూరు డీసీసీబీ పరిధిలోనే దాదాపు రూ.80 కోట్లకు పైగానే సొమ్ము దుర్వినియోగమైందని రైతులు అంటున్నారు. ఉమ్మడి ప్రకాశం డీసీసీబీ కిందకు వచ్చే చీరాల, అద్దంకి, పర్చూరు సొసైటీల్లో కూడా పెద్దఎత్తున అక్రమాలు జరిగాయని వాటన్నింటిపై సమగ్ర విచారణ జరగాలనే డిమాండ్లు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి.



పంగులూరు మండలంలోని నూజెళ్లపల్లి పీఏసీఎస్ భవనం

ఉద్యోగులపైనా వేధింపులు..

అవినీతి ఆరోపణలే కాకుండా ఉద్యోగులను వేధించడంలో త్రీమెన్ కమిటీలు ఇష్టారీతిన వ్యవహరించాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పనిచేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో వైసీపీ విధేయులకు పోస్టింగ్ ఇచ్చుకున్నారు. 2019 కన్నా ముందు సొసైటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేసేందుకు అప్పటి టీడీపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పాత తేదీలు వేసి మరీ వారికి కొమ్ముకాసే ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్న విమర్శలు అప్పట్లో వ్యక్తమయ్యాయి. రుణాల పేరిట స్వాహా చేసిన మొత్తాలతో పాటు ఉద్యోగుల రెగ్యులరైజ్ విషయంలో జరిగిన అవకతవకల విషయంలో సమగ్ర విచారణ దిశగా కొత్త ప్రభుత్వం ప్రక్షాళన మొదలెట్టింది.

ఆడిట్ నివేదికలపై దృష్టి...

ప్రతి ఏడాది సొసైటీల్లో చేపట్టే ఆడిట్ నివేదిక వివరాలను గత ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వం రావడంతో రాష్ట్రస్థాయిలోనే ఆ నివేదికలపై కదలిక ప్రారంభమైంది. ఆయా సొసైటీల్లో వాటికి సంబంధించిన నివేదికలపై తీవ్ర కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. వైసీపీ నేతల సేవలో తరించిన వీరవిధేయ ఉద్యోగులు ఇప్పటికే సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఆడిట్ నివేదికలతో పాటు ఐదేళ్ల వ్యవధిలో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులు ఇవన్నీ బేరీజు వేసుకుని ఎక్క డెక్కడ అక్రమాలు జరిగాయన్న విషయం గుర్తించి వారిపై చర్యలు తీసుకునే దిశగా ప్రభుత్వం వడివడిగా అడుగులేస్తోంది.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం..

సొసైటీల్లోని కమిటీలన్నీ కూడా రద్దు కావడంతో సహకార సంఘాల్లో పర్సన్ ఇన్‌చార్జిల నియామకానికి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అక్కడ నుంచి గ్రీన్‌సిగ్నల్ రాగానే ఉద్యోగులు ఆయా పోస్టుల్లో కొలువు దీరనున్నారు. ఇక కొత్త ప్రభుత్వం ప్రాధామ్యాల ప్రకారం సహకార సంఘాలకు ఎన్నికలు జరపడమా లేదా అనేది త్వరలోనే నిర్ణయం కానుంది. అప్పటివరకు పర్సన్ ఇన్‌చార్జిల ద్వారా పాలన నడిపించనున్నారు. ఆయా సొసైటీల్లో ఐదేళ్ల వ్యవధిలో పొందిన రుణాలు, సదరు పేర్ల వివరాలపై ఇప్పటికే నూతన ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది.

ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా వీటిలో 68 సొసైటీలు ఉమ్మడి గుంటూరు పరిధిలోని డీసీసీబీ కింద ఉండగా, 44 పీఏసీఎస్‌లు ఉమ్మడి ప్రకాశం పరిధిలోని డీసీసీబీ కింద ఉన్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లావ్యాప్తంగా చూస్తే మొత్తం 167 సహకార సంఘాలు ఉన్నాయి. డీసీసీబీకి సెవన్‌మెన్ కమిటీలు, పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీలను నామినేటెడ్ పద్ధతిన వైసీపీ ప్రభుత్వం నియమిస్తూ వచ్చింది. ఈ కమిటీల్లో ఆ పార్టీ ద్వితీయ శ్రేణి నేతాగణానికి చోటు కల్పించి ఇష్టారీతిన వ్యవహరించారు. నూతన ప్రభుత్వం కొలువుదీరగానే కొంతమంది వెంటనే రాజీనామాలు సమర్పించగా, ప్రభుత్వం జారీచేసిన జీవో ప్రకారం ఆ పదవులన్నీ రద్దయినట్లయింది. అన్ని కమిటీలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తప్పుకోవాలనే నోటీసులు కూడా సహకార శాఖ పంపించింది.



నెరవేరిన కల

- మూడు జిల్లాల్లో 318మంది గ్రేడ్-5 కార్యదర్శులకు డీడీవో అధికారాలు
- జీవో ఇచ్చి నాలుగు నెలలు తొక్కిపెట్టిన గత ప్రభుత్వం
- ఎన్నికల ముందు ఫిబ్రవరిలో హడావుడిగా జీవో జారీ
- కొత్త ప్రభుత్వం రాకతో ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శుల కల ఎట్టకేలకు నెరవేరింది. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వేళ వారికి డీడీవో అధికారాలు సొంతమయ్యాయి. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 568 మందిని పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-5గా గత ప్రభుత్వం ఎంపిక చేసింది. కానీ వారందరినీ సచివాలయాలకే పరిమితం చేసి గ్రామ పంచాయతీ వ్యవస్థను నీరుగార్చింది. వందల సంఖ్యలో పంచాయతీలు ఖాళీగా వున్నా.. అంతకు మించిన సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులు కళ్లెదుటే వున్నా వారికి అధికారాలు మాత్రం ఇవ్వలేదు. వారిని సచివాలయాల్లోనే ఉంచి జాబ్‌చార్టు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంది. ఫలితంగా కార్యదర్శులు లేక పంచాయతీల పనితీరు పూర్తిగా దెబ్బతింది. ఉద్యోగుల నుంచి ఒత్తిడి వస్తుండడంతో కార్యదర్శులకు అధికారాలు ఇస్తామని 2022లోనే వైసీపీ ప్రభుత్వం జీవో నెం.149 విడుదల చేసి హడావుడి చేసింది. ఆ తరువాత జీవోను బుట్టదాఖలు చేసింది. మరలా ఈ ఏడాది ఎన్నికలకు ముందు హడావుడిగా ఫిబ్రవరి 15న మరోమారు జీవో ఎంఎస్. నెం.11 పేరుతో మరో జీవో విడుదల చేసింది. అది కూడా అమలుకు నోచుకోలేదు.

నాలుగు నెలల క్రితమే జీవో..

నాలుగు నెలల క్రితమే ప్రభుత్వం జీవో ఇచ్చినా జిల్లా స్థాయిలో అధికారులు జీవోలను తొక్కిపెట్టారు. గత ప్రభుత్వానికి ఎన్నికల్లో లబ్ధి చేకూర్చాలన్న ఉద్దేశంతోనే తమకు విధులు కేటాయించకుండా తాత్సారం చేశారని గ్రేడ్-5 కార్యదర్శులు గతం నుంచి ఆరోపిస్తూనే ఉన్నారు. ఉమ్మడి జిల్లా కలెక్టర్ వారి ఆరోపణలకు బలం చేకూర్చేలా వుంది. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 1230 గ్రామ పంచాయతీలు వుండగా, దాదాపు 700 మంది గ్రేడ్- 1, గ్రేడ్-2, గ్రేడ్-3, గ్రేడ్- 4 పంచాయతీ కార్యదర్శులు వున్నారు. 2019లో సచివాలయ పరీక్షల ద్వారా మరో 568 మందిని గ్రేడ్ -5 పంచాయతీ కార్యదర్శులు ఎంపికైనా వారికి విధులు కేటాయించలేదు. దీంతో వారంతా సచివాలయాల్లో, గ్రేడ్- 1- 4 కార్యదర్శుల సహాయకులుగా మాత్రమే మిగిలిపోయారు. డీడీవో పవర్ ఇవ్వలేదు. పంచాయతీ కార్యదర్శులకు ఉండే డీడీవో పవర్ మాటేమోగానీ, కనీసం జనన, మరణ, వివాహ నమోదు, ధ్రువీకరణ పత్రాల జారీ, పారిశుధ్యం, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక విధులు కూడా వారికి దక్కలేదు. దీంతో చాలా పంచాయతీల్లో సాధారణ పరిపాలన దెబ్బతింది. 'ఒక పంచాయతీ ఒక కార్యదర్శి' దస్త్రాలపై 2023 సెప్టెంబరులోనే అప్పటి ముఖ్యమంత్రి సంతకం చేసినప్పటికీ అది జిల్లాలో అమలుకు నోచుకోలేదు. పంచాయతీ కార్యదర్శులను వారి శాఖకు సంబంధించిన విధులకు పరిమితం చేయకుండా సంబంధం లేని అనేక విధులకు కేటాయిస్తున్నారు. అందులో భాగంగా దాదాపు 91 మందికి బీఎల్‌వో విధులు కేటాయించారు. ఆ విధులకు అటంకం ఏర్పడుతుందన్న కారణంగా అపాయింటింగ్ అథారిటీగా వున్న గుంటూరు జిల్లా కలెక్టర్ జీవోను అమలు చేయకుండా ఆపారని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

318 మందికి పంచాయతీల కేటాయింపు

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో మొత్తం 318 మందికి ప్రత్యేకంగా గ్రామ పంచాయతీలు కేటాయించారు. ఇప్పటి వరకూ అమలులో ఉన్న క్లస్టర్ విధానాన్ని రద్దు చేసి, క్లస్టర్ పరిధిలో ఉన్న అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేకంగా ఒక పంచాయతీ కార్యదర్శిని కేటాయించారు. పల్నాడు జిల్లాలో అత్యధికంగా 159 పంచాయతీలకు, బాపట్ల జిల్లాలో 89 పంచాయతీలకు, గుంటూరు జిల్లాలో 70 పంచాయతీలకు పంచాయతీ కార్యదర్శులను కేటాయించారు. కాగా ఇప్పటికే పంచాయతీల పరిధిలో పనిచేస్తున్నవారికి ఆయా పంచాయతీలనే ఖరారు చేశారు. కాగా రెండు, మూడు సచివాలయాలు ఉన్న మేజర్ పంచాయతీల్లో సీనియర్ కార్యదర్శిని యథాతథంగా కొనసాగిస్తున్నారు. కాగా సచివాలయాల్లో వున్న గ్రేడ్-5 కార్యదర్శులకు మాత్రం పంచాయతీలను కేటాయించలేదు. ఇలాంటి వారు 50 మంది వరకూ వున్నట్లు తెలుస్తోంది. దీనికి తోడు పోటీ పరీక్షలు, ఇతర ఆరోగ్య సమస్యల కారణంగా సెలవుపై మరో 40 మంది వరకూ ఉండొచ్చని తెలుస్తోంది. వారందరికీ పోస్టింగు పెండింగులో వుంది. ఖాళీగా ఉన్న పంచాయతీలను గుర్తించి వారిని ఆ పంచాయతీలకు కేటాయిస్తామని అధికారులు చెబుతున్నారు.

నాలుగున్నరేళ్ల పోరాట ఫలితం..

మాకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించిన కూటమి ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు రుణపడి వుంటాం. గత ప్రభుత్వం మమ్మల్ని నియమించినా, సేవలను వినియోగించుకోలేదు. మానవ వనరులన్నీ వృధా అయిపోయాయి. ఈ ప్రభుత్వం దాన్ని గమనించి సరిచేసింది. మా సేవలు పూర్తి స్థాయిలో అందిస్తాం.

- బెజ్జం రోజా ప్రకాశ్, గ్రామ వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

చీరాల ఘటనలపై.. లోకేశ్ ఆరా

- ఎవరినీ ఉపేక్షించవద్దని ఎమ్మెల్యే కొండయ్యకు ఆదేశం
- బాధితులకు అండగా ఉంటామని భరోసా



చీరాల, జూన్ 24: వారం రోజుల్లో చీరాల నియోజకవర్గంలో జరిగిన వరుస ఘటనలపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక దృష్టి సారించినట్లు విశ్వసనీయ సమాచారం. ఆయా ఘటనలకు సంబంధించి పూర్వాపరాలపై ఆరా తీస్తున్నట్లు తెలిసింది. ఆ క్రమంలోనే ఎమ్మెల్యే కొండయ్యకు ప్రత్యేక సమాచారం పంపినట్లు తెలిసింది. అందుకు అనుగుణంగా తదుపరి చర్యలకు కొండయ్య కార్యాచరణ రూపొందించుకుంటున్నట్లు తెలిసింది. ఎస్‌బీ, పోలీస్, ఇంటెలిజెన్స్, రెవెన్యూ, మండల పరిషత్ పనితీరుపై ఎమ్మెల్యే కొండయ్య సమగ్ర సమాచారం సేకరిస్తున్నారు. అధికార యంత్రాంగం వైఫల్యమా, యాదృశ్చిక ఘటనా అనే కోణంలో కూడా ఆరా తీస్తున్నారు. గంజాయి, మత్తు పదార్థాలు సేవించి విశృంఖలంగా వ్యవహరించే వ్యక్తులు ఎంతటి వారైనా సరే ఉపేక్షించవద్దని, అలాంటి వారిపై కఠిన చర్యలకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం.

గంజాయి బ్యాచ్‌లపై నిఘా.. తల్లిదండ్రులకు శిక్ష

ప్రాథమికంగా గంజాయి బ్యాచ్‌లపై ప్రత్యేక నిఘా పెట్టారు. అందులో భాగంగా గంజాయి సేవించేవారు, విక్రయించేవారితో పాటు వారి తల్లిదండ్రులపై కూడా కేసుల నమోదు చేసి జైలుకు పంపే దిశగా తగిన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పోలీస్ అధికారులకు చెప్పారు. గంజాయితో పాటు ఇతర మత్తుపదార్థాలైన నిషేధిత పొగాకు ఉత్పత్తుల రహస్య విక్రయాలపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా

జరుగుతున్న ఘటనకు సంబంధించి పాత నేరస్తులు, రౌడీ షీటర్ల కదలికలపై కూడా పోలీస్ ప్రత్యేక దృష్టి సారించింది. తీరప్రాంతంలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం ఆందోళన కలిగించే స్థాయికి చేరింది. తీరప్రాంత గ్రామాల్లో సిగెరెట్, కిల్లీ దొరికినంత సులువుగా గంజాయి దొరుకుతుండడం అందుకు నిదర్శనమంటున్నారు. పలు కాలేజీల విద్యార్థులకు కూడా బృందాలుగా గంజాయిని సరదా పేరుతో సేవిస్తున్నారు.

తీరంలో క్యాంప్ ఫైర్లు.. మద్యం పార్టీలు

రామాపురం, కఠారివారిపాలెంల మధ్య రిసార్టుల నిర్వాహకులు క్యాంప్ ఫైర్ పేరుతో రాత్రిళ్ల విందు, వినోదాలకు తెరతీశారు. వాస్తవానికి వాటికి ఎలాంటి అనుమతులు ఉండవు. ఇది అన్ని శాఖల ప్రభుత్వ అధికారులకు తెలిసిన బహిరంగ రహస్యం. కానీ వాటిపై కన్నెత్తి చూడరు. అలా నిర్వహించే కొన్ని పార్టీలలో కూడా గంజాయి వినియోగం జరుగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.



సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం

వరుస ఘటనల నేపథ్యంలో వాడరేవు, రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మధ్య సముద్ర స్నానాలపై తాత్కాలిక నిషేధం విధించారు. అది శాశ్వత పరిష్కారం కాదు. రిసార్టుల నిర్వాహకుల ఒత్తిడికి లోనుకాకుండా ప్రభుత్వ యంత్రాంగం, పాలకులు కొన్ని కఠిన నిర్ణయా లు తీసుకుంటేనే అన్ని సమస్యలకు పరిష్కారం దొరుకుతుందని ప్రజలు భావిస్తున్నారు.

షూటింగ్‌ల పేరిట మినీ రేవ్ పార్టీలు

రామాపురం, పొట్టి సుబ్బయ్యపాలెం మధ్య తీరంలో షార్ట్ ఫిల్మ్‌ల షూటింగ్‌ల పేరుతో కొందరు మినీ రేవ్ పార్టీలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. విషయం తెలిసినవారు నిజమేనని చెప్తున్నారు. ఎన్‌డీపీ (నాన్ డ్యూటీ పెయిడ్) లిక్కర్ వినియోగం, గంజాయితో పాటు ఇతర మత్తు పదార్థాలు కూడా కొంతమేర వినియోగిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

మాతో అందరికీ మొహమాటం

జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో చిన్న చిన్నగా రిసార్ట్‌ల నిర్వాహకులు ఏకతాటిపైకి వస్తున్నారు. ఐక్యతా స్వరం వినిపించాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. అందులో భాగంగా పలు శాఖల అధికారులు, రాజకీయ నాయకులకు తమతో మొహమాటం ఉంటుందని, సందర్భానుసారంగా వారి సిఫార్సులను తాము అంగీకరిస్తుంటామని రిసార్టు నిర్వాహకులలో పలువురు తమ సన్నిహితులకు చెప్పటం విశేషం. అదే నిజమైతే జరుగుతున్న నష్టాలు, మూల్యంగా చెల్లిస్తున్న ప్రాణాలకు ఖరీదు కట్టినట్లే.

అనుమతులతో నిర్వహిస్తే పర్యాటకులకు భద్రత.. ప్రభుత్వానికి ఆదాయం

వాడరేవు, రామాపురం, కఠారివారిపాలెం, పొట్టి సుబ్బయ్యపాలెంలో ఉన్న రిసార్టుల నిర్వాహకులు తాము నిర్వహించే రిసార్టులకు లెక్కా, పత్రాలు పక్కాగా చూపాలి. క్యాంప్ ఫైర్ లాంటివి నిర్వహిస్తే అనుమతి పొందాలి. తీరంలో ఆయా రిసార్టుల నిర్వాహకులు ప్రభుత్వంతో కలసి గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలి. హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి. స్థానిక స్థితిగతులను తెలిపే గైడ్‌లను ఏర్పాటు చేయాలి. దీంతో పలువురికి ఉపాధి వస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం ఉంటుంది. పర్యాటకులకు భద్రత ఉంటుంది.

ఆగని.. ఇసుక దందా

- సర్కార్ మారినా ఇసుక అక్రమ తవ్వకాల ఆపని వైసీపీ నాయకులు



బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం పడమర బాపట్ల పంచాయతీ మహాత్మాజీపురం గ్రామశివారులో రైల్వేట్రాక్ పక్కన అక్రమ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. సర్కార్ మారినప్పటికీ వైసీపీ నాయకులు ఎంతో ధీమాగా ఇసుక తవ్వకాలను జరుపుతున్నారు. అడిగేవారు అడ్డుకునేవారు లేరనే రాత్రుల సమయంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పంట పొలాల మధ్య ఇసుకను జేసీబీల ద్వారా అధికలోతు తవ్వటంతో భూసారం తగ్గిపోవటంతో రైతులు తమ పంట దిగుబడి తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్వారీలలో ఇసుకను తవ్వి పెద్దపెద్ద గుట్టలుగా వేసి రాత్రుల సమయాల్లో ఇసుక రవాణా జరుపుతున్నారు. గత కొన్నిరోజులు నుంచి ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతున్నప్పటికీ సెబ్ అధికారులు నిర్లక్ష్యం వహించి ఇసుకాసురులపై చర్యలు తీసుకోకపోవటం మీద పలు విమర్శలకు దారితీస్తున్నది. ఇప్పటికైనా మహాత్మాజీపురం గ్రామశివారులో జరుగుతున్న అక్రమ ఇసుక తవ్వకాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జిల్లా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకుంటారో లేదో వేచిచూడాలి.



వెస్ట్ బాపట్ల మహాత్మాజీపురం పంట పొలాల్లో వైసీపీ నేతలు జరుపుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

భారత వాయుసేనలో అగ్నివీరులు

భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వశాఖకు చెందిన భారత వాయుసేన అగ్నిపథ్ స్కీంలో భాగంగా అగ్నివీర్ వాయు నియామకాలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదలైంది.

పోస్టు: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ - అగ్నివీర్ వాయు

అర్హత: కనీసం 50 శాతం మార్కులతో మేథమెటిక్స్ ఫిజిక్స్, ఇంగ్లిష్ సబ్జెక్టులతో ఇంటర్మీడియట్(10+2)/ఇంటర్మీడియట్ (సైన్స్ కాని ఇతర సబ్జెక్టులు) లేదా మూడేళ్ల ఇంజనీరింగ్ డిప్లొమా(మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్/ఆటోమొబైల్/కంప్యూటర్ సైన్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ) తత్సమాన ఉత్తీర్ణత. నిర్దిష్ట శారీరక దారుఢ్య/వైద్య ప్రమాణాలు కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3 మధ్య జన్మించి ఉండాలి.

ఎత్తు: పురుషులు 152.5 సెం.మి.; మహిళలు 152 సెం.మీ. ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: ఫేజ్-1(ఆన్‌లైన్ రాత పరీక్ష), ఫేజ్-2(ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్, అడాప్టబిలిటీ టెస్ట్-1, అడాప్టబిలిటీ టెస్ట్-2), ఫేజ్-3(మెడికల్ ఫిట్‌నెస్ టెస్ట్), ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా

పరీక్ష ఫీజు: రూ.550

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: జూలై 8

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూలై 28

ఆన్‌లైన్ పరీక్షలు ప్రారంభం: అక్టోబరు 18

వెబ్‌సైట్: agnipathvayu.cdac.in/AV/



దిక్సూచి DIKSUCHI

మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్

న్యూఢిల్లీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్(ఎన్ఐహెచ్ఎఫ్‌డబ్ల్యూ)- 'మాస్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్(ఎంపీహెచ్)' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: ద్వితీయ శ్రేణి మార్కులతో డిగ్రీ(మెడిసిన్/ఆయుష్/డెంటిస్ట్రీ/నర్సింగ్/ఫార్మసీ/వెటర్నరీ సైన్స్/ఫిజియోథెరపీ/ఆక్యుపేషనల్ థెరపీ/న్యూట్రిషన్/ఫార్మకాలజీ/అలైడ్ అండ్ హెల్త్ సైన్సెస్/లైఫ్ సైన్సెస్/బయోటెక్నాలజీ/స్టాటిస్టిక్స్/బయోస్టాటిస్టిక్స్/మేనేజ్‌మెంట్/ఇంజనీరింగ్/డెమోగ్రఫీ/పాపులేషన్ స్టడీస్/సోషియాలజీ/సైకాలజీ/ఆంత్రోపాలజీ/సోషల్ వర్క్/ఎకనామిక్స్/లా) ఉత్తీర్ణులై ఉండాలి.

❍ **చివరి తేదీ:** జూలై 9

❍ **వెబ్‌సైట్:** www.nihfw.ac.in

50వ జీ-7 సమావేశం

ఆహ్వానిత దేశంగా భారత్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి దిక్సూచి తరువాయి)

జీ-7 విశిష్టత: జీ-7 దేశాలన్నీ పారిశ్రామికంగా, ఆర్థికంగా, శాస్త్ర సాంకేతికపరంగా ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలుగా ఉన్నాయి.

- అంతేకాక ఇవి ప్రపంచంలోనే అత్యధిక బంగారం నిల్వలు, అణుశక్తి ఉత్పత్తి కలిగిన దేశాలు. అధిక ఎగుమతులు కలిగిన దేశాలు.
- ఐక్యరాజ్య సమితికి నిధుల వితరణపరంగా శక్తిమంతమైన దేశాలు.
- ప్రపంచ జనాభాలో పదిశాతం మాత్రమే కలిగి ప్రపంచ నికర సంపదలో మాత్రం 60 శాతం మూటగట్టుకున్న ధనిక దేశాలు.

జీ-7 లక్ష్యం: ప్రాథమికంగా జీ-7 లక్ష్యం ఆర్థిక, రాజకీయపరమైన అంతర్జాతీయ అంశాలపరంగా సభ్యదేశాలకు సంబంధించి ఉమ్మడి వ్యూహాలను రచించడమే అయినప్పటికీ కాలక్రమంలో ఈ లక్ష్యాల పరిధి విస్తరించి అంతర్జాతీయ ఆర్థిక స్థిరత్వం, ప్రపంచ భద్రత, శక్తి/ఇంధన వనరుల సంబంధిత అంశాలు, పర్యావరణం, సామాజిక భద్రత వంటి అనేక కీలక అంశాలకు స్థానం లభిస్తోంది.

జీ-7 భారతదేశం: కొంతకాలంగా వరుసగా ఈ సమావేశాలకు ఆహ్వానాన్ని అందుకుంటున్న భారత్ జీ-7 యవనికపై తన ముద్రను వేస్తూనే ఉంది. కొవిడ్ మహమ్మారి విజృంభణను అరికట్టేందుకు భారత్ జీ-7 47వ సమావేశంలో 'వన్ ఎర్త్, వన్ హెల్త్' అనే నినాదంతో 'సమష్టి కృషి' ఆవశ్యకతను చాటిచెప్పింది. కొవిడ్ టీకా పరిశోధనల్లో, ముడి పదార్థాల అందుబాటులో దేశాల మధ్య సహకారాన్ని పెంచేందుకు కృషిచేసింది. అదేవిధంగా టీకాల అందుబాటు పెంచేందుకు అడ్డంకిగా ఉన్న ట్రిప్స్ నిబంధనలను తొలగించాలని డబ్ల్యూటీఓ(ప్రపంచ వాణిజ్య సంస్థ)లో దక్షిణాఫ్రికాతో కలిసి దాఖలు చేసిన విజ్ఞప్తిని జీ-7 దేశాల మద్దతుకు కృషిచేసింది. అదేవిధంగా 2023లో జపాన్‌లోని హిరోషిమాలో జరిగిన గత సదస్సులో ప్రధాని మోదీ మూడు ప్లీనరీ సమావేశాల్లో పాల్గొని ప్రపంచశాంతి, వాతావరణ మార్పుల నిరోధం, ఇతరత్రా బహుముఖ సంక్షోభాలపరంగా భారతవాణిని వినిపించారు. ఈ సమావేశంలో భారత్ కొన్ని అంతర్జాతీయ చొరవలకు మార్గదర్శనం చేసింది. భారత్ ప్రతిపాదించిన లైఫ్ స్టయిల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్, ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్, మిల్లెట్స్ అండ్ అదర్ ఏన్షియంట్ గ్రైన్స్ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇనీషియేటివ్ వంటి చొరవలు 'హిరోషిమా యాక్షన్ ప్లాన్ ఫర్ రిసైలియంట్ గ్లోబల్ ఫుడ్ సెక్యూరిటీ'లో గుర్తించారు.

జీ-7 భారత్ మధ్య పరస్పర అవసరాలు

- భారతదేశం ప్రస్తుతం ప్రపంచంలోనే అయిదో అతిపెద్ద ఆర్థికవ్యవస్థగా అవతరించింది. జీ-7లోని సగం దేశాలకు పైగా(కెనడా, ఇటలీ, జర్మనీ, ఫ్రాన్స్‌ల కన్నా కూడా) పెద్ద ఆర్థికవ్యవస్థ అయినందున జీ-7, భారత్ మధ్య సంబంధం పరస్పర లాభదాయకంగానే ఉంటుంది.
- ప్రస్తుతం ప్రాధాన్యం పొందుతున్న హిందూ-పసిఫిక్ ప్రాంత భౌగోళిక రాజకీయాల్లో గ్లోబల్ సౌత్‌కు ప్రాతినిధ్యం వహించే భారత్ భాగస్వామ్యం వ్యూహాత్మకంగా చాలా కీలకం. హిందూ-పసిఫిక్ ప్రాంతంలో విస్తరిస్తున్న చైనా ఆధిపత్యాన్ని నిలువరించడానికి జీ-7 కూటమికి భారత్ అవసరం ఉండగా, చైనాను ధీటుగా ఎదుర్కోడానికి బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌కు ప్రత్యామ్నాయాలు తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్న జీ-7 మద్దతు భారత్‌కు అంతే అవసరం ఉంది.
- శాస్త్ర సాంకేతికరంగాల్లో, క్లీన్ ఎనర్జీ/పునరుత్పాదక శక్తిరంగం, డిజిటల్ టెక్నాలజీ వంటి రంగాల్లో ముందు వరుసలో ఉన్న జీ-7 దేశాలకు మద్దతు భారత్‌కు అవసరం. అదేవిధంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశం అత్యధిక జనాభాతో కూడిన అతి పెద్ద మార్కెట్‌ను జీ-7 దేశాలకు అందిస్తోంది.
- ప్రపంచ శాంతి సామరస్యాలు కాపాడటానికి, వాతావరణ మార్పుల కట్టడి చర్యలకు, ఆర్థిక నేరాలు, ఉగ్రవాదం, సముద్ర మార్గాల రక్షణ వంటి అనేక ఉమ్మడి సమస్యలపై పోరాడటానికి అభివృద్ధి చెందిన జీ-7 దేశాల కూటమికి, అభివృద్ధి చెందుతున్న గ్లోబల్ సౌత్ దేశాల ప్రతినిధిగా భారత్‌కు మధ్య సమన్వయానికి దోహదపడుతుంది.
- జీ-7 సమావేశాల నేపథ్యంలో జరిగే వివిధ దేశాలతో భారత్ ద్వైపాక్షిక సమావేశాలు భారత్‌కు పలు దేశాలకు మధ్య వాణిజ్య, రక్షణ, దౌత్య సంబంధాలను బలపర్చడానికి ఒక చక్కని అవకాశం.



ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/yknNzixలో చదవండి.



పవన్‌కల్యాణ్‌ను కలసిన తెలుగు సినిమా నిర్మాతలు

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను సినీ పరిశ్రమ తరఫున అభినందించేందుకు అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామని నిర్మాత అల్లు అరవింద్ తెలిపారు. సోమవారం మధ్యాహ్నం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో పలువురు నిర్మాతలు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కీలక అంశాలపై వారు చర్చించారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ.. సినీ పరిశ్రమ తరఫున పవన్ కల్యాణ్‌ను అభినందించడానికి అపాయింట్‌మెంట్ కోరడానికి వచ్చామన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. అదేవిధంగా సీఎం చంద్రబాబుతో భేటీ కావడానికి అపాయింట్ ఇప్పించాలని కోరినట్టు తెలిపారు. దీనిపై చంద్రబాబుతో మాట్లాడి చెబుతానని పవన్ కల్యాణ్ తెలిపినట్టు వివరించారు. తెలుగు చిత్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చించ లేదని, త్వరలోనే మరోసారి కలసి చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీ రంగం విస్తరణకు ఉన్న అవకాశాలపై చర్చిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర పర్యాటక సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, నిర్మాతలు సి.అశ్వనీదత్, ఎ.ఎం.రత్నం, డి.సురేష్ బాబు, ఎస్.రాధాకృష్ణ(చిన బాబు), దిల్‌రాజు, భోగవల్లి ప్రసాద్, డి.వి.వి.దానయ్య, సుప్రియ, ఎన్.వి.ప్రసాద్, బన్నీ వాసు, నవీన్ ఎర్నేని, నాగవంశీ, టి.జి.విశ్వప్రసాద్, వంశీకృష్ణ, వై.రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

- అమరావతి (ఆంధ్రజ్యోతి)

28 ఏళ్ల తర్వాత...





సరిగ్గా 28 ఏళ్ల క్రితం 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రం విడుదలైంది. చిరంజీవి సోదరుడు పవన్‌కల్యాణ్‌కు, ఏయన్నార్ మనవరాలు సుప్రియకు ఇదే తొలి సినిమా. ఈవీవీ సత్యనారాయణ దర్శకుడు , అల్లు అరవింద్ నిర్మాత. ఆ సినిమా తర్వాత హీరోగా ఎదిగి పవన్‌కల్యాణ్ పవర్‌స్టార్ అయ్యారు. సుప్రియ మాత్రం నటనకు క్రమంగా దూరమై, నిర్మాణరంగంలోకి ప్రవేశించి అక్కడే స్థిరపడ్డారు. సోమవారం ఇతర నిర్మాతలతో పాటు సుప్రియ కూడా పవన్‌కల్యాణ్‌ను కలిశారు. ఈ సందర్భంగా వీరిద్దరూ దిగిన ఫొటో సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. కొందరైతే 'అక్కడ అమ్మాయి.. ఇక్కడ అబ్బాయి' చిత్రంలోని వీరిద్దరి ఫొటోను.. ఇప్పటి ఫొటోను జతచేసి.. సూపర్ అంటూ కామెంట్లు పెడుతున్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేశ్‌ను సీనియర్ నిర్మాత కె.ఎస్.రామారావు సోమవారం అమరావతిలో కలసి అభినందించారు. త్వరలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో సమావేశమై సినీ రంగ సమస్యలను చర్చిద్దామని దుర్గేశ్ రామారావుకు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పరిశ్రమ అభివృద్ధి చెందుతుందనీ, అందుకు సహజమైన లొకేషన్లు, ప్రోత్సహించే ప్రభుత్వం ఉన్నాయని రామారావు తెలిపారు. సినిమా పరిశ్రమ పట్ల అవగాహన కలిగిన దుర్గేశ్ మంత్రిగా ఉన్నందుకు ఆయన హర్షం వ్యక్తం చేశారు.

విశ్వంభర సెట్‌కు వినాయక్



మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ ప్రస్తుతం అన్నపూర్ణ సెవెన్ ఏకర్స్‌లో వేసిన భారీ సెట్‌లో జరుగుతోంది. దర్శకుడు వి.వి.వినాయక్ సోమవారం ఈ సెట్‌కు వెళ్లారు. మెగాస్టార్ చిరంజీవిని కలసి కాసేపు ముచ్చటించారు. ఆయనతో తనకున్న ప్రత్యేక అనుబంధాన్ని పంచుకున్నారు. దర్శకుడు వశిష్ఠకు, చిత్ర నిర్మాతలకు అభినందనలు తెలిపారు వినాయక్. మెగాస్టార్ చిరంజీవి, వినాయక్, వశిష్ఠ కలసి ఉన్న ఫొటోని చిత్రం టీమ్ సోషల్ మీడియాలో షేర్ చేసింది. యూవీ క్రియేషన్స్ సంస్థ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 'విశ్వంభర' చిత్రాన్ని నిర్మిస్తోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతి కలిగించడానికి అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జనవరి 10న విడుదల కానుంది. విక్రమ్, వంశీ, ప్రమోద్, నిర్మిస్తున్నారు.

ఒకే తెరపై రజనీ, సల్మాన్



'రాజారాణి', 'తెరి', 'మెర్సల్', 'బిగిల్' చిత్రాలతో సూపర్‌హిట్ డైరెక్టర్ అనిపించుకున్న అట్లీ కుమార్.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి షారుక్ ఖాన్ చిత్రం 'జవాన్' చిత్రంతో బ్లాక్‌బస్టర్ హిట్ కొట్టారు. ఆయన ప్రస్తుతం సల్మాన్ ఖాన్‌తో ఓ చిత్రం చేస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా అందిన సమాచారం మేరకు ఈ సినిమాలో రజనీకాంత్ కూడా నటించనున్నారు. ఇలా ఒకే తెరపై వీరిద్దరూ కనపడితే.. వారి అభిమానుల ఆనందాలకు హద్దులు ఉండకపోవడమే కాకుండా అది బాక్సాఫీస్‌కు కూడా పండుగ వాతావరణాన్ని తెప్పిస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అయితే ఇందులో రజనీ ఏ పాత్రను పోషిస్తున్నారో ఇంకా తెలియాల్సి ఉంది. ఈ చిత్ర నిర్మాత, సన్ పిక్చర్స్ అధినేత కళానిధి మారన్‌కు సూపర్‌స్టార్‌తో ఉన్న సత్సంబంధాల వల్లే ఈ ప్రాజెక్ట్‌లో నటించేందుకు రజనీ పచ్చజెండా ఊపారని తెలుస్తోంది. ప్రస్తుతం 'సికిందర్' షూటింగ్‌లో సల్మాన్, 'కూలీ' చిత్రీకరణలో బిజీగా ఉన్న రజనీ.. ఆ ప్రాజెక్ట్ పూర్తి కాగానే ఈ సినిమా సెట్స్‌లోకి అడుగుపెట్టనున్నారు.

బాలీవుడ్‌లోకి శ్రీలీల




క్యూట్ బ్యూటీ శ్రీలీల బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనున్నారు. డేవిడ్ ధావన్ దర్శకత్వంలో వరుణ్‌ధావన్ నటించబోయే చిత్రానికి శ్రీలీలను ఖరారు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ చిత్రాన్ని జూలై నుంచి సెట్స్‌పైకి తీసుకువెళ్లడానికి సన్నాహాలు చేస్తున్నారు. కథాంశంగా ట్రయాంగిల్ లవ్ స్టోరీని ఎంచుకున్నారని.. కన్‌ఫ్యూజన్, కామెడీ కలగలసిన ఈ చిత్రం ప్రేక్షకులని కడుపుబ్బా నవ్వించేలా ఉంటుందట. టైటిల్, ఇతర తారాగణం, సాంకేతిక సిబ్బంది ఇంకా ఖరారు కాని ఈ చిత్రాన్ని రమేశ్ తౌరని నిర్మించనున్నారు. ఇటువంటి క్రేజీ ప్రాజెక్ట్‌తో బాలీవుడ్‌లోకి ఎంటర్ అవుతున్నందున.. ఇక బీ టౌన్‌లో కూడా ఆమె కెరీర్‌కు ఢోకా ఉండదని అంటున్నారు. డేవిడ్ ధావన్, వరుణ్ ధావన్ కలయికలో ఇదివరకు 'మై తేరా హీరో', 'జుడ్వా 2' చిత్రాలు వచ్చి.. బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను రాబట్టాయి.

ట్రెండ్‌కు అనుగుణంగా..



'హను-మాన్' చిత్రంతో ఈ ఏడాది ప్రారంభంలో బ్లాక్ బస్టర్ హిట్ సాధించిన చిత్ర నిర్మాణ సంస్థ ప్రైమ్ షో ఎంటర్‌టైన్‌మెంట్ ఇప్పుడు ప్రియదర్శి నభా నటేశ్ జంటగా నిర్మిస్తున్న 'డార్లింగ్' చిత్రం జులై19న విడుదల కానుంది. అశ్విన్‌రామ్ ఈ చిత్రానికి దర్శకుడు. రోమ్ కామ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన ఈ సినిమాతో మరోసారి హిట్ సాధిస్తామని నిర్మాతలు నిరంజన్‌రెడ్డి, చైతన్య చెబుతున్నారు. ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణమైన అంశాలతో అన్ని వర్గాల ప్రేక్షకుల్ని అలరించడానికి ఈ చిత్రం సిద్ధమవుతోంది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చిందని తెలిపారు. బ్రహ్మానందం, విష్ణు, కృష్ణతేజ్, అనన్య నాగళ్ల కీలక పాత్రలు పోషించిన ఈ చిత్రానికి నరేశ్ రామదురై సినిమాటోగ్రాఫర్. హేమంత్ సంభాషణలు రాశారు.



వైజయంతి పాత్రలో మళ్లీ!

విజయతార విజయశాంతి 34 ఏళ్ల క్రితం 'కర్తవ్యం' చిత్రంలో పోలీస్ ఆఫీసర్ వైజయంతి పాత్రను పోషించారు. ఆ చిత్రం ఆమె నట జీవితాన్ని సరికొత్త మలుపు తిప్పడమే కాకుండా జాతీయ స్థాయిలో ఉత్తమ నటిగా అవార్డు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం నందమూరి కల్యాణ్‌రామ్ హీరోగా నటిస్తున్న చిత్రంలో విజయశాంతి 'కర్తవ్యం' తరహాలో పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రను పోషిస్తున్నారు. ఆమె పాత్ర పేరు కూడా వైజయంతి కావడం గమనార్హం. విజయశాంతి పుట్టినరోజు సందర్భంగా ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమె గెటప్ రివిల్ చేశారు. ఈ పోస్టర్‌తోనే ఆమె పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో తెలియజేశారు. అలాగే గ్లింప్స్‌ను కూడా రిలీజ్ చేశారు. 'వైజయంతి ఐపీఎస్.. తను పట్టుకుంటే పోలీస్ తుపాకీకే ధైర్యం వస్తుంది.. వేసుకుంటే యూనిఫామ్‌కే పౌరుషం వస్తుంది. తనే ఒక యుద్ధం.. నేనే తన సైన్యం' అంటూ కల్యాణ్‌రామ్ వాయిస్ ఓవర్‌తో విజయశాంతి పాత్రను పరిచయం చేశారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మిస్తున్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2czlCy9 లో చదవండి.

సూర్యలంక తీరంలో పర్యటన నిషేధం

● అలల ఉధృతి ఎక్కువగా ఉండడంతో..



సూర్యలంక తీరానికి పర్యాటకులు వెళ్ళకుండా రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం

బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం సూర్యలంక సముద్రతీరానికి సోమవారం పర్యాటకుల నిషేధాన్ని అధికారులు ప్రకటించారు. తీరానికి వాహనాలు, పర్యాటకులు వెళ్ళకుండా సూర్యలంక రహదారిపై పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేశారు. అలలు ఉధృతి ఎక్కువగా ఉండటంతో గత 2, 3 రోజుల్లోనే 15మంది యువకులు గల్లంతు కాగా మెరైన్ రూరల్ పోలీసులు, గజఈతగాళ్ళు ఆ యువకులను కాపాడి ప్రాణాలను రక్షించారు. సూర్యలంకతీరంలో పోలీసు బందోబస్తును డీఎస్పీ మురళీకృష్ణ పరిశీలించారు నాలుగైదు రకోజుల తర్వాత పర్యాటకులు స్నానాలు చేసేందుకు అనుమతించటం జరుగుతుందని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. జిల్లాలోని సముద్రతీరప్రాంతాలకు యాత్రీకుల అనుమతి తాత్కాలికంగా నిషేధిస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వైసీపీ కార్యకర్తలకు ముందస్తు బెయిల్ నిరాకరణ

నరసరావుపేట లీగల్, జూన్ 24 : వైసీపీ కార్యకర్తలకు కోర్టు ముందస్తు బెయిలు నిరాకరించింది. గత నెల 13న సాధారణ ఎన్నికల సందర్భంగా చోటు చేసుకున్న హింసాత్మక ఘటనల్లో మల్లమ్మ సెంటర్‌లో బొలేరో వాహనాన్ని దహనమైంది. ఈ కేసులో నిందితులైన పట్టణంలోని అరండల్‌పేటకు చెందిన శివరాత్రి అశోక్ కుమార్, వడ్డెర కాలనీకి చెందిన బండారు సాయి మహేష్‌లకు ముందస్తు బెయిల్‌ను నిరాకరిస్తూ స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

10 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా

రెంటచింతల, జూన్ 24: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న 10మంది ఫీల్డ్ అసిస్టెంట్లు రాజీనామా చేశారు. వారి సిమ్ కార్డులను ఏపీవో స్వాధీనం చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డిపై ఫిర్యాదు



రొంపిచర్ల ఎస్ఐ రవీంద్రకు ఫిర్యాదు అందజేస్తున్న గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి

రొంపిచర్ల, జూన్ 24: మండలంలోని రెడ్డిపాలెం గ్రామానికి చెందిన గంగిరెడ్డి శ్రీనివాసరెడ్డి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిపై సోమవారం రొంపిచర్ల పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2022లో బార్ షాపులో తనకు వాటా ఇప్పిస్తానని చెప్పి రూ.20లక్షలు గోపిరెడ్డి తీసుకున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. తనకు వాటా ఇప్పించకపోవటంతో 2023లో తన డబ్బు తనకు ఇవ్వాలని అడిగినందుకు అక్రమ మద్యం కేసు పెట్టి తనకు జైలుకు పంపించాడని పేర్కొన్నాడు. ఫిర్యాదును ఎస్ఐ కేపీ రవీంద్రకు అందజేశాడు. తనకు తగిన న్యాయం చేయాలని కోరాడు.

అరాచక ఖాకీల ఆగడాలు

● ఒక్కొక్కటిగా వెలుగులోకి...
● చేయని నేరానికి పోలీసుల దాడిలో గాయపడ్డ బాధితులు
● ముడుపులు తీసుకున్నప్పటికీ వదిలిపెట్టకుండా కేసుల నమోదు
● వెలుగుచూస్తున్న వెల్దుర్తి పోలీసుల దాష్టికాలు



బాధితులు హరికృష్ణ, ఆంజనేయులు



వైసీపీ రౌడీషీటర్ మన్నెయ్యతో కానిస్టేబుల్ చలమయ్య(వృత్తంలో..)

మాచర్ల రూరల్, జూన్ 24: గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వంలో వెల్దుర్తి మండలంలో పోలీసులు చేసిన ఆగడాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల ఒత్తిడికి తట్టుకోలేక కొంతమంది పార్టీ మారగా, మరికొందరు బలవన్మరణంకు పాల్పడిన ఘటనలు కూడా ఉన్నాయి. వైసీపీ నేతలు చెప్పిందే తడవుగా టీడీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడంతోపాటు ఆర్థికంగా కూడా నష్టపరిచారు. ప్రధానంగా మండాది గ్రామంలో గత ఆరు నెలల క్రితం జరిగిన ఓ చోరీ కేసులో అనుమానితులుగా అదే గ్రామంలోని రజక సామాజిక వర్గానికి చెందిన అన్నదమ్ములైన రాయళ్ల హరికృష్ణ, ఆంజనేయులును వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. అప్పటి ఎస్ఐ శ్రీహరితో పాటు కానిస్టేబుల్ చలమయ్యలు వారిని చిత్రహింసలకు గురిచేశారు. ఒంటిపై నూలుపోగు లేకుండా చేసి బూటుకాళ్లతో తొక్కిపట్టి పంగ చీల్చి దెబ్బలు బయటకు కానరాకుండా నరకం చూపించినట్లు బాధితులు వాపోయారు. పోలీసుల చిత్రహింసలకు హరికృష్ణ స్పృహ కోల్పోగా హరికృష్ణను స్టేషన్ నుంచి బయటకు తీసుకు రావడానికి నలుగురు సాయంతో మోసుకురావాల్సి వచ్చింది. నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నాలుగైదు రోజులు ఐసీయూలో అత్యవసర వైద్య చికిత్స అందించిన పిదప హరికృష్ణ కోలుకున్నారు. ఆసుపత్రిలో వైద్య చికిత్సకు రూ.లక్షన్నర దాకా వెచ్చించాల్సి వచ్చింది. ఇప్పటికీ తమపై ఎటువంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా చేయని నేరానికి అన్నదమ్ములిరువురిని పోలీసులకు చిత్రహింసలకు గురి చేయడం మానసిక క్షోభకు గురి చేస్తోందని బాధితులు వాపోతున్నారు.

మరికొన్ని గ్రామాల్లో...

అలాగే రచ్చమలపాడుకు చెందిన ఓ వ్యక్తిపై మహిళ ఫిర్యాదు చేసింది. అయితే అతని వద్ద భారీ మొత్తంలో నగదు తీసుకొని స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపించారు. ఇది అవకాశంగా తీసుకొని వైసీపీ నాయకులు ఎస్ఐ శ్రీహరికి ఫోన్ చేసి మరలా సదరు వ్యక్తిని పోలీస్‌స్టేషన్లో వేయించారు. మరసపెంటకు చెందిన గిరిజనులపై అక్రమ మద్యం సరఫరా చేస్తున్నారంటూ స్టేషన్‌కు పిలిపించి చిత్రహింసలకు గురి చేశారు. వారు పెద్ద మొత్తంలో నగదు పోలీసులకు ముట్టజెప్పడంతో కేసు కూడా నమోదు చేయకుండా పంపించారు. అలాగే జెండాపెంటకు చెందిన మత్స్యకారుడు దుర్గారావుపై కూడా మద్యం కేసు నమోదు చేయడంతో హైకోర్టుకు వెళ్లి బెయిలు తెచ్చుకున్నారు. అయినప్పటికీ తరచూ స్టేషన్‌కు రమ్మని ఫోన్ చేయడంతో పోలీసులు కొడతారనే భయంతో దుర్గారావు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అప్పట్లో సంచలనం రేపింది. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల విషయంలో టీడీపీ గిరిజన నేతపై కేసు నమోదుతో పాటు పెద్ద మొత్తంలో డబ్బులు గుంజినట్లు సమాచారం. ఈ సంఘటనలోనే ఓ అధికారి వద్ద భారీ ఎత్తున ముడుపులు పుచ్చుకొని ప్రైవేటు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వైసీపీ ప్రభుత్వం పోయి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్లో జరిగిన దాష్టీకాలకు సంబంధించి బాధితులు ఒక్కొక్కరిగా బయటకు వస్తున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది బాధితులు బయటకు వచ్చే అవకాశం ఉంది. వెల్దుర్తి మండలంలో వైసీపీ నేతలతో అంటకాగుతూ టీడీపీ సానుభూతిపరులను హింసలకు గురిచేసిన ఎస్ఐ శ్రీహరి, కానిస్టేబుల్ చలమయ్యలు అధిక మొత్తంలో ముడుపులు రూపంలో దండుకొని ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం జరిగిందని, వారివురు అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

సస్పెండైనా తీరుమారలేదు...

దుర్గి మండలంలోని శ్యామరాజపురంలో అక్రమ మద్యం విక్రయిస్తున్నారంటూ ఓ వ్యక్తిపై తప్పుడు కేసు పెట్టి అప్పటి దుర్గి ఎస్ఐ రామాంజినేయులుతోపాటు కానిస్టేబుల్ చలమయ్యలు 2021లో సస్పెండ్ అయ్యారు. తరువాత చలమయ్య అప్పటి అధికార పార్టీ వైసీపీ నేతల అండదండలతో వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌కు చేరాడు. ఎస్ఐ శ్రీహరికి రైట్ హ్యాండ్‌గా ఉండి వైసీపీ నేతల ప్రోద్బలంతో టీడీపీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం, భారీ స్థాయిలో ముడుపులు తీసుకొని చిత్రహింసల పాలు చేశారు.

వైసీపీ అక్రమ నిర్మాణంపై నోటీసులు

● వారం రోజుల్లో వివరణ ఇవ్వాలి

బాపట్ల, జూన్24(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా బాపట్ల పట్టణంలో నిర్మించిన వైసీపీ జిల్లా కార్యాలయ భవనంపై మున్సిపల్ విభాగం దృష్టి సారించింది. ఆ భవన నిర్మాణానికి ప్లాన్ సహా ఎలాంటి అనుమతులు తీసుకోకపోవడాన్ని తీవ్రంగా పరిగణించి నోటీసులు ఇవ్వడానికి రంగం సిద్ధం చేశారు. సోమవారమే తాఖీదులు సిద్ధమయినప్పటికీ కొన్ని సంతకాలతో పాటు వైసీపీ జిల్లా అధ్యక్షులు అందుబాటులో లేకపోవడం వల్ల కూడా మంగళవారం నోటీసులు ఇవ్వనున్నారు. నోటీసులకు వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని, అప్పటికీ స్పందించకపోతే తదుపరి తీసుకునే చర్యలను వివరిస్తూ మరోసారి నోటీసులు ఇస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత ప్రభుత్వ ఆదేశాలను బట్టి భవనాన్ని వేరే అవసరాలకు ఉపయోగించడమో లేక కూల్చివేయడమా అనే నిర్ణయం తీసుకోవడం జరుగుతుందని వివరించారు. మరో వైపు లీజు వ్యవహారంపై రెవెన్యూ విభాగం కూడా దృష్టి సారించింది. నామమాత్రపు అద్దెకు స్థలాన్ని లీజుకు తీసుకున్నప్పటికీ ఆ మొత్తాన్ని కూడా ఇప్పటివరకు చెల్లించలేదని తెలుస్తోంది. దీనిపై కూడా త్వరలోనే నోటీసులు ఇచ్చి వివరణ అడిగే అవకాశం ఉన్నట్లు సమాచారం

రాజప్రాసాదం లాంటి భవనంపై ప్రజల్లో చర్చ...

వైసీపీ జిల్లా కార్యాలయం పేరిట రాజప్రసాదం లాంటి భవనం నిర్మించడం పట్ల ప్రజల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. మరో వైపు పట్టణం నడిబొడ్డున విలాసమైన భవంతి నిర్మాణం జరుగుతుంటే ఎలాంటి అనుమతులు లేవని మున్సిపల్ విభాగం తాపీగా ఇప్పుడు చెప్పడం వైసీపీకి వ్యవస్థల గులాంగిరీకి నిదర్శనంగా కనబడుతోంది. భవనం పూర్తయి విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత నోటీసులంటూ హడావిడి చేయడం పట్ల పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆ భవనం నిర్మించేటప్పుడు వైసీపీ ప్రాపకం కోసం ఉదాసీనంగా వ్యవహరించిన మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలడే డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

25, 26 తేదీల్లో నాలుగు రైళ్ల పునరుద్ధరణ

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో గతంలో నాలుగు రైళ్లను రద్దు చేసిన రైల్వే శాఖ వాటిని పునరుద్ధరించింది. నెంబరు. 12805 విశాఖపట్టణం - లింగంపల్లి జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు, తిరిగి సెప్టెంబరు 16 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు రద్దు చేస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పుడు దానిని పక్కన పెట్టి ఈ నెల 25వ తేదీ నుంచి ఈ రైలుని యధాతథంగా నడుపుతామని ప్రకటించారు. నెంబరు.12806 లింగంపల్లి - విశాఖపట్టణం జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ని గతంలో జూన్ 24 నుంచి ఆగస్టు 11, సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 16వ తేదీ వరకు రద్దు చేశారు. ఇప్పుడు ఈ రైలుని ఈ నెల 26వ తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నట్లు పేర్కొన్నారు. నెంబరు. 17463 చెంగల్‌పట్టు - కాకినాడ పోర్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 23 నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు గతంలో రద్దు చేయగా దీనిని కూడా ఈ నెల 25 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు తెలిపారు. నెంబరు.17644 కాకినాడ పోర్టు - చెంగల్‌పట్టు సర్కారు ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 24 నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు రద్దు చేయగా ఇప్పుడు దీనిని ఈ నెల 26 నుంచి పునరుద్ధరిస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు.

సెప్టెంబరు నెలాఖరు వరకు ప్రత్యేక రైళ్ల సర్వీసుల పొడిగింపు

గుంటూరు మీదగా ప్రయాణిస్తున్న పలు ప్రత్యేక రైలు సర్వీసులను సెప్టెంబరు నెలాఖరు వరకు పొడిగించినట్లు డీఆర్ఎం తెలిపారు. నెంబరు. 07609 పూర్ణ - తిరుపతి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07610 తిరుపతి - పూర్ణ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. నెంబరు. 07632 నరసపూర్ - హైదరాబాద్ రైలుని జూలై 7 నఉంచి సెప్టెంబరు 29వ తేదీ వరకు, నెంబరు. 07445 కాకినాడ టౌన్ - లింగంపల్లి రైలుని జూలై 1 నుంచి సెప్టెంబరు 30వ తేదీ వరకు, నెంబరు. 07446 లింగంపల్లి - కాకినాడ టౌన్ రైలు జూలై 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు పొడిగించినట్లు తెలిపారు.

సీజీజీబీకి ప్రతిష్టాత్మక అవార్డు



ఏపీవై అవార్డును అందుకుంటున్న సీజీజీబీ చైర్మన్ ప్రమోద్‌కుమార్‌రెడ్డి తదితరులు

గుంటూరు, జూన్ 24: న్యూ ఢిల్లీలో పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ (పీఎఫ్ఆర్‌డీఏ) నిర్వహించిన వార్షిక ఫెలిసిటేషన్ కార్యక్రమంలో చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ (సీజీజీబీ) ప్రతిష్టాత్మక అటల్ పెన్షన్ యోజన (ఏపీవై) అవార్డుతో సత్కరించటం జరిగింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎండీ, సీఈవో ఎ.మణిమేఖలై హాజరై ఈ అవార్డు సీజీజీబీ అత్యుత్తమ పనితీరు, నిబద్ధతకు గుర్తింపని ప్రశంసించారు. సీజీజీబీ బ్యాంక్ చైర్మన్ కె.ప్రమోద్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రతిష్టాత్మక అవార్డును బ్యాంకు ఉద్యోగులకు అంకితం చేస్తూ, ఈ సందర్భంగా ఉద్యోగుల కృషి, బ్యాంకు అభివృద్ధికి ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. ఈ అవార్డు ఆర్థిక చేరికను ప్రోత్సహించటం, వినియోగదారులకు అద్భుతమైన సేవలందించినందుకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాంకు జనరల్ మేనేజర్ డాక్టర్ బీవీ రమణారావు తదితరులున్నారు.

గణపవరంలో రెండు ఇళ్ళలో చోరీ

● రూ.10 లక్షల విలువైన సొత్తు అపహరణ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ, ఎస్ఐలు

నాదెండ్ల, జూన్ 24: మండలంలోని గణపవరం గ్రామంలో రెండు ఇళ్ళల్లో చోరీ జరిగింది. ఈ ఘటనలో రూ.10 లక్షల విలువైన సొత్తును దుండగులు ఎత్తుకు వెళ్ళారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగు చూసింది. గ్రామంలోని మువ్వావారి వీధిలో నివాసం ఉంటున్న పాలచర్ల వెంకట రఘు రామిరెడ్డి గ్రామంలోని ఒక ప్రైవేట్ మిల్లులో ఉద్యోగిగా పని చేస్తున్నాడు. తన మనుమరాలు పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు భార్యతో కలసి ఈనెల 19న హైదరాబాద్ వెళ్ళాడు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి వచ్చిన వారు ఇంటి వెనుక తలుపులు, బీరువాలు తీసి ఉండటాన్ని గుర్తించారు. బీరువాలోని రూ.2.30 లక్షలు నగదు, సుమారు ఏడు సవర్లకు పైగా బంగారు ఆభరణాలు, సుమారు రెండు కిలోల వెండి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. కాగా సినిమా హాల్ రోడ్డులో నివాసం ఉంటున్న చిలుకూరి రమేష్ కుమారుడు అమెరికా నుంచి వచ్చాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులందరూ కొన్ని రోజులుగా గుంటూరులో ఉంటున్నారు. సోమవారం ఇంటికి వచ్చి చూడగా డోర్ లాక్‌లు, గేట్ల తాళాలు పగల గొట్టిన విషయాన్ని గుర్తించాడు. ఇంట్లో ఎలాంటి ఆభరణాలు, విలువైన వస్తువులు లభించక పోవటంతో దుండగులు గడ్డపారను అక్కడే పడవేసి పరారయ్యారు. గుంటూరు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ వేలి ముద్రల నమూనాలను సేకరించింది. చిలకలూరిపేట రూరల్ సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ జే బాలరామిరెడ్డి, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు చోరీ జరిగిన ఇళ్ళను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. నాదెండ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

55 క్వింటాళ్ళ రేషన్ బియ్యం స్వాధీనం



కొమెరపూడి విఘ్నేశ్వర రైస్ మిల్లులో స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ అధికారులు

సత్తెనపల్లి, జూన్ 24: సత్తెనపల్లి మండలం కొమెరపూడిలోగల విఘ్నేశ్వర రైస్ మిల్లులో అక్రమంగా కొనుగోలు చేసి నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని సోమవారం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గుంటూరు రీజనల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, స్థానిక సివిల్ సప్లయిస్ అధికారులు విఘ్నేశ్వర రైస్ మిల్లుపై దాడి చేసి తనిఖీలు నిర్వహించారు. గుమస్తా కృష్ణారెడ్డిని అధికారులు విచారించారు. 110 బస్తాల్లో నిల్వ ఉంచిన 55 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు గుర్తించారు. మిల్లు యజమాని గంగాధరరెడ్డిపై 6(ఏ) కేసు నమోదుచేయాలని స్థానిక సివిల్ సప్లయిస్ డీటీ అరుణను విజిలెన్స్ అధికారులు ఆదేశించారు. తనిఖీల్లో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులరెడ్డి, ఏ శ్రీహరిరావు, సత్తెనపల్లి సివిల్ సప్లయిస్ డీటీ అరుణ, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ మాఫియాకు అడ్డుకట్ట వేస్తా

● ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరుటౌన్, జూన్24: పొన్నూరు నియోజకవర్గంలో గత ఐదేళ్లుగా అవినీతి రేషన్ మాఫియాతో వచ్చిన చెడ్డపేరును మాఫియాలకు అడ్డుకట్ట వేయటం ద్వారా మార్పు చూపిస్తామన్ని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ స్పష్టం చేసారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం మండల పరిషత్ పరిధిలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో అమలవుతున్న సంక్షేమ పథకాలు అభివృద్ధి పనుల గురించి నివేదికలను కోరారు. రెవెన్యూ శాఖ సమీక్షలో నరేంద్ర మాట్లాడుతూ ఎన్నికల ముందు హడావుడిగా నివేశన స్థలాల కోసం ఆఫ్‌లైన్‌లో చేసిన దరఖాస్తుల రిజిస్ట్రేషన్ల వివరాలను అందచేయాలని ఆదేశించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి కేటగిరి 3 క్రింద నియమించిన ఏజెన్సీలకు ఏ ప్రాతిపదికన నిర్మాణ కాంట్రాక్టు ఇచ్చారని ప్రశ్నించారు. లబ్దిదారులకు కాంట్రాక్టర్లకు మధ్య ఒప్పందాలు చేయటంలో ఎందుకు ఆసక్తి చూపించారని ప్రశ్నించటంతో అధికారుల వద్ద సమాధానం లేదు. నిర్మాణసామగ్రి తరలించిన ఘటనపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డ్వాక్రా సమీక్ష సందర్భంగా ఐదేళ్ల కాలంలో జరిగిన అవకతవకలు సరిచేయాలని ఆదేశించారు. విద్యుత్‌శాఖ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా ప్రజాసమస్యలు పరిష్కరించాలని సూచించారు. అగ్రికల్చర్ల మోటార్ల విద్యుత్ కనెక్షన్ల మంజూరు సమయంలో వసూళ్లు నిల్పివేయాలని ఆదేశించారు. అలాగే గ్రీవెన్స్‌కు వచ్చిన అర్జీలు సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. గత పాలకుల అవినీతి మత్తు నుంచి అధికారులు బయటపడాలని ఎమ్మెల్యే హెచ్చరించారు. సమావేశంలలో ఎంపీడీవో పి.రత్నజ్యోతి, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోలీసులకు బంగారం వ్యాపారి బురిడీ

● డబ్బు ఎగ్గొట్టేందుకు ఎత్తుగడ వేసిన నిందితుడు
● చాకచక్యంగా కేసును ఛేదించిన పోలీసులు





వివరాలు వెల్లడిస్తున్న సీఐ కళ్యాణ్‌రాజు
ఇన్‌సెట్లో సీజ్ చేసిన నకిలీ బంగారం, సెల్ ఫోన్

తాడేపల్లి, జూన్ 24: తాను ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు బావకే టోపీ పెట్టబోయి ప్లాను బెడిసి కొట్టడంతో పోలీసులకు చిక్కిన ముద్దాయి అతని అనుచరుల ఉదంతమిది. ఈ మేరకు తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు సోమవారం సాయంత్రం పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలు వెల్లడించారు. మంగళగిరికి చెందిన గోల్డ్ వ్యాపారి గుర్రంకొండ రాము గోల్డ్ వ్యాపారం చేస్తుంటాడు. తన వ్యాపార అవసరాల నిమిత్తం తన బావ, ఫిర్యాది అని పసుపులేటి వీరాంజనేయులు నుంచి రూ.90లక్షల మేర దఫదఫాలుగా నగదు తీసుకున్నాడు. తిరిగి ఆ డబ్బుల గురించి వీరాంజనేయులు అడుగుతుండగా రాము ఇవ్వకుండా కాలయాపన చేస్తూ నగదు ఎగ్గొట్టేందుకు పథకం రచించాడు. ఈ క్రమంలో ఈ నెల 19న వీరాంజనేయులుకు ఫోన్ చేసి హైదరాబాద్‌నుండి వస్తున్నాను, బంగారం తెస్తున్నాను. దానిని నీకు ఇవ్వవలసిన డబ్బుల తాలూకు తీసుకోమని, విజయవాడ ఆర్టీసి బస్టాండ్‌కు రమ్మని చెప్పగా ఫిర్యాది తన మోటారు సైకిల్‌పై విజయవాడ వెళ్లి రామును తీసుకుని బండిపై వస్తుండగా కొలనుకొండ మోడల్ డెయిరీ వద్దకు వచ్చేసరికి ముగ్గురు వ్యక్తులు మరో బైక్‌పై వీరిని ఫాలో అవుతూ రాము చేతిలో ఉన్న బ్యాగును లాక్కొని పరారయ్యారు. దీంతో వీరాంజనేయులు తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నార్త్ డీఎస్పీ రవికాంత్ ఆధ్వర్యంలో తాడేపల్లి సీఐ కళ్యాణ్‌రాజు, ఎస్ఐ ప్రతాప్‌లు కేసు దర్యాప్తు చేపట్టగా సదరు రాము తన బావకు ఇవ్వాల్సిన డబ్బులు ఎగ్గొట్టేందుకు రత్న, బబ్లూ అలియాస్ శరత్‌బాబు, మహబూబ్ బాషా, ప్రసన్న అనే వారిని సంప్రదించి నకిలీ బంగారం తీసుకుని విజయవాడ నుంచి వస్తానని మార్గమధ్యలో బ్యాగు దొంగిలించి వెళ్లాలని రూ.10లక్షలు ఇస్తానని అడ్వాన్సుగా రూ.50వేలు ఇచ్చి కేసు అయితే చూసుకుంటానని వారితో చెప్పగా వారు అంగీకరించారు. దీంతో వారు ప్లాను అమలుకు రాము వాహనాన్ని అనుసరిస్తూ అతని వద్ద ఉన్న బ్యాగును దొంగిలించి పరారయ్యారు. పోలీసులు కేసును ఛేదించి కేసుతో ప్రమేయమున్న రాము, రత్న, బబ్లూ, మహబూబ్ బాషాలను సోమవారం అరెస్టు చేసి వారి నుంచి నాలుగు నకిలీ బంగారు బిస్కెట్లు ఒక మొబైల్‌ను స్వాధీనపరచుకున్నారు. ఈ కేసుకు సంబంధించి ప్రమేయమున్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని, వారిని కూడా త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ కళ్యాణరాజు తెలిపారు.

జీవో నం.117ను రద్దు చేయాలి

● విద్యామంత్రికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి



మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌టీఏ రాష్ట్ర కార్యదర్శి హైమారావు

గుంటూరు(విద్య), జూన్ 24: ప్రాథమిక పాఠశాలలకు శరాఘాతంగా మారిన జీవోనం 117ను రద్దు చేయాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతిలోని సచివాలయంలో విద్యామంత్రి నారా లోకేశ్‌ను కలిసి రాష్ట్ర శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటరావు, బి.హైమారావు తదితరులు వినతి పత్రం అందజేశారు. ప్రాథమిక విద్యకు ఆటంకంగా జీవో 117 మారిందని, అనేక స్కూల్స్ మూతపడుతున్నాయని పేర్కొన్నారు. దీనిని రద్దు చేసిన ఉన్నత పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమానికి సమాంతరంగా తెలుగు మాధ్యమం ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సంఘం నాయకులు మంత్రి నారా లోకేశ్‌ను సత్కరించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	136, 147,156
చికెన్ విత్ స్కిన్	260.00
చికెన్ స్కిన్ లెస్	270.00

40,696 టిక్కీల మిర్చి అమ్మకం

గుంటూరు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 45,769 టిక్కీల మిర్చి విక్రయానికి రాగా అందులో 40,696 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్‌కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డులో 17,563 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	16500
నెంబరు. 5	10000	14500
273	11000	14500
341	9000	17000
4884	--	--
సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7500	20000
బ్యాడిగి	9000	16000
దేవనూరుడీలక్స్	10000	15500

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
తెల్లకాయలు	4500	12000
ఏసీ కామన్ వెరైటీ		
334	9000	18000
నెంబరు. 5	13500	13500
341	9000	18000
4884	10500	16500
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	19700
బ్యాడిగి	9500	15000
దేవనూరుడీలక్స్	15000	15000
తెల్లకాయలు	5500	11000

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భట్టిప్రోలు, జూన్ 24 : భట్టిప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో పల్లెకోన ఫీడర్‌లోని గ్రామాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఏఈ ఏడుకొండలు తెలియజేశారు. పల్లెకోన ఫీడర్ పరిధిలో మరమ్మతులు నిర్వహిస్తున్న కారణంగా మండలంలోని వేమవరం, సూరేపల్లి, తాతావారిపాలెం, కోనేటిపురం, పడమటపాలెం, పల్లెకోన, రాచూరు, అళ్ళమూడి గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సదరు విషయాన్ని గమనించి సహకరించాలని ఏడుకొండలు కోరారు.

నాసా శాస్త్రవేత్తతో సంభాషించిన ఐలవరం విద్యార్థులు



నాసా శాస్త్రవేత్త హెన్రీ ట్రూప్‌తో సంభాషిస్తున్న ఐలవరం విద్యార్థులు

భట్టిప్రోలు, జూన్ 24 : స్కైప్ ఆన్‌లైన్ ద్వారా వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు, ప్రొఫెసర్లు, విద్యార్థులతో మండలంలోని ఐలవరం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆంగ్లభాషలో సంభాషిస్తున్నారు. తద్వారా ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తున్నారు. ఇదే క్రమంలో నాసా శాస్త్రవేత్త హెన్రీ ట్రూప్‌తో ఐలవరం విద్యార్థులు సోమవారం ఆన్‌లైన్ ద్వారా సంభాషించారు. విద్యార్థులు అడిగిన పలు ఛాలెంజింగ్ ప్రశ్నలకు శాస్త్రవేత్త సవివరంగా సమాధానాలు ఇచ్చారు. నాసా శాస్త్రవేత్త హెన్రీ ట్రూప్‌తో నెల రోజుల క్రితమే సంభాషించిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పి.హరికృష్ణ విద్యార్థులతో సంభాషించేందుకు అనుమతి తీసుకున్నారు. గ్రామీణ పాఠశాలలోని విద్యార్థులకు ఇటువంటి అవకాశం లభించడం చాలా అరుదుగా ఉంటుందని అలాంటిది ఐలవరం పాఠశాల విద్యార్థులకు అవకాశం కలగడం గర్వంగా ఉందని హెచ్ఎం మాచర్ల మోహనరావు తెలియజేశారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు హరికృష్ణను, విద్యార్థులను అభినందించారు.

డీడీవోలుగా గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులు



ఎంపీడీవోను కలిసిన గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులు

భట్టిప్రోలు, జూన్ 24 : గ్రేడ్ - 5 పంచాయతీ కార్యదర్శులను డీడీవో లుగా అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై కార్యదర్శులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో పని చేస్తున్న సచివాలయ కార్యదర్శులు రాచూరు - సురేష్, కోనేటిపురం - చిన వెంకటేష్‌బాబు, అళ్ళమూడి - ప్రదీప్‌కుమార్, చింతమోటు - రాగదీపక్, పెసర్లంక - గణేష్‌లు డీడీవోలుగా అధికారం కల్పిస్తారని ఎంపీడీవో మల్లికార్జునరావు సోమవారం తెలియజేశారు. డీడీవోలుగా అధికారం పొందిన సచివాలయ కార్యదర్శులు ఎంపీడీవో మల్లికార్జునరావు, ఈవోపీఆర్డీ ఊహారాణిలను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

గోపికృష్ణ కుటుంబానికి ఆర్డీవో రవీందర్ పరామర్శ

కర్లపాలెం, జూన్ 24: అమెరికాలో దుండగుల కాల్పుల్లో మృతి చెందిన యాజలి గ్రామస్తులు దాసరి గోపికృష్ణ తల్లిదండ్రులను ఆదివారం రాత్రి బాపట్ల ఆర్డీవో గంధం రవీందర్ పరామర్శించారు. గోపికృష్ణ దుండగుల కాల్పుల్లో మృతి చెందటం చాలా బాధాకరమని గోపికృష్ణ మృతికి సంతాపం వెలిబుచ్చారు. తల్లిదండ్రులు, వారి కుటుంబసభ్యులకు ఆర్డీవో తమప్రగాడ సానుభూతిని తెలిపారు. ప్రభుత్వపరంగా అన్నివిధాలా సహాయం అందేవిధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చర్యలు చేపడుతున్నారని కుటుంబ సభ్యులకు తెలిపారు. వీరి వెంట తహసీల్దార్ నిర్మలానందబాబా తదితరులు ఉన్నారు.

పవన్‌కల్యాణ్ విజయంతో మొక్కు తీర్చుకున్న గ్రామస్థులు

కొల్లూరు, జూన్ 24 : అసెంబ్లీ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ విజయం సాధించాలని మొక్కుకున్న గ్రామస్థులు సోమవారం ఆ మొక్కు తీర్చుకున్నారు. మండలపరిధిలోని ఈపూరులంక కాపులూరులో పవన్ కల్యాణ్ ఘన విజయం సాధించడంతో పాటు ఉపముఖ్యమంత్రిగా శాసనసభలో అడుగుపెట్టడంతో మొక్కును చెల్లించుకున్నారు. మహిళలు స్థానిక పోతురాజుస్వామి గుడి వద్ద 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ సారధ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్లాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు అందజేశారు.

వైభవంగా శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవం



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వరస్వామి, శ్రీమహాలక్ష్మీ, శ్రీవరసిద్ధి వినాయక, శ్రీఅయ్యప్పస్వామి దేవాలయ శ్రీవారి ప్రతిష్ఠ జరిగి సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా దేవాలయంలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఉదయం పంచామృత ఆరాధన, అగ్నిప్రతిష్ఠాపన, విశేషహోమం, పూర్ణాహుతి, ప్రథమ ప్రతిష్ఠోత్సవ విశేష దివ్యకళ్యాణ మహోత్సవాన్ని వేదపండితులు అంగరంగవైభవంగా నిర్వహించారు. కొండుభొట్లవారిపాలెంలో మొట్టమొదటి శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం, ఏకాంతసేవలో భక్తులు వేలాదిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధి, రాష్ట్రాభివృద్ధి కాంక్షిస్తూ సర్వజనులు శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలని ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు నారాయణం వెంకటకిరణ్‌కుమార్, నల్లూరి పంచజన్యకృష్ణమాచార్యులు, ఆలయ పాలకవర్గం, భక్తులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఉపయోగించుకోవాలి

కర్లపాలెం, జూన్ 24: తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని మండల ప్రజలు ఉపయోగించుకోవాలని కర్లపాలెం తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. కర్లపాలెం తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికను నిర్వహించగా మండలంలోని పలుశాఖల అధికారులు పాల్గొన్నారు. అర్జీలు ఏమిరాలేదని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నేతాజి, ఈవోపీ ఆర్డీ ఏలిషాబాబు, ఏపీ ఎం శ్రీనివాసరెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ఏఈ దిలీప్, భాగ్యలక్ష్మి, పశువైద్యాధికారి తిరుమల తేజ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అధికారులు పాల్గొన్నారు.

8 ఎకరాల గడ్డివామి, పశువులపాక దగ్ధం

రేపల్లె, జూన్ 24: నగరం మండలం యాదవపాలెంకు చెందిన దబ్బుకూటి కోటయ్యకు చెందిన 8ఎకరాల గడ్డివామి, పశువుల పాకకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా దగ్ధమైంది. సోమవారం గడ్డివామికి నిప్పంటుకోవటంతో సమీప గృహాల యజమానులు అగ్నిమాపక సిబ్బందికి విషయం తెలపటంతో హుటాహుటిన వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లిందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

సమానత్వ సాధనే విద్యార్థులకు వరం

● తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్

పిట్టలవానిపాలెం, జూన్ 24: అసమానతలకు తావులేని సమానత్వ సాధనే విద్యార్థులకు విద్యాపరంగా ఉపయోగపడే యూనిఫామ్‌లు అందించటమే ప్రభుత్వ లక్ష్యమని తెలుగుమహిళా మండల అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరియానేట్ సోపాటి అన్నారు. మండలంలోని సంగుపాలెం గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఏకరూప దుస్తులను సోమవారం ఆమె అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యపట్ల మక్కువ చూపుతూ విద్యార్థులకు బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సమానత్వానికి ఎంతో ప్రాధాన్యత నిస్తున్నారన్నారు. విద్యార్థులు గ్రామస్థాయి నుంచి విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీకుమారి, నియోజకవర్గ తెలుగురైతుకమిటీ కార్యదర్శి బర్మాపీటర్‌పాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయరంగానికే ప్రథమ ప్రాధాన్యం

● అధికారులతో సమీక్షలో ఎమ్మెల్యే ఆనందబాబు



నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆనందబాబు

అమృతలూరు, జూన్ 24 : వ్యవసాయరంగానికి ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. సోమవారం మండలపరిధిలోని కూచిపూడి లాకు వద్ద కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కార్యాలయంలో నీటిపారుదల, డ్రైనేజ్ శాఖల ఈఈ, డీఈ, ఏఈ, ఇతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ శాఖల అధికారులతో ప్రధాన, బోదె కాల్వల పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. 5 సంవత్సరాల కాలంలో ఏ మేరకు పనులు చేశారని అధికారులను అడుగ్గా వారి నుంచి ఎలాంటి సమాధానం రాలేదు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గం డెల్టా ప్రాంతంలో ఉందని, ఈ ప్రాంతం వ్యవసాయరంగంపై ఆధారపడి ఉందని అందువల్ల రైతులకు మేలు జరిగేలా వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. ఖరీఫ్ ప్రారంభం అవుతుందని, ప్రస్తుతం కాల్వలో తూటికాల, గుర్రపుడెక్క, ఆకు పేరుకుపోయిందని ఇందువల్ల నీరు ముందుకు సాగదని వెంటనే కాల్వలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించాలని ఇందుకోసం ప్రభుత్వం ప్రస్తుతం కేటాయించిన 2.50 కోట్లు నిధులను వినియోగించాలన్నారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ శాఖను నిర్లక్ష్యం చేసిందని, పనులు చేయకుండానే నిధులు స్వాహా చేసిందన్నారు. కార్యాలయం ఎదురుగా ఇరిగేషన్ శాఖకు చెందిన ఖాళీ స్థలం ఆక్రమణలో ఉండటంపై ఆగ్రహం వ్యక్త పరిచారు. వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. ఇరిగేషన్, డ్రైనేజ్‌శాఖల ఈఈలు మల్లికార్జునరావు, వెంకటర్నతం, దుగ్గిరాల, రేపల్లె, పొన్నూరు, తెనాలి డీఈఈలు ఎన్‌కెవీ ప్రసాద్, దీన్‌దయాళ్, ధనలక్ష్మీ, ఎం అనీల్ కుమార్, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ మైనేని మురళీకృష్ణ, యలవర్తి బ్రహ్మానందం, తమ్మా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కరించాలి : కుచ్చెళ్ళపాడు రైతులు

వేమూరు, జూన్ 24 : వరహాపురం మెయిన్ ఛానల్ కింద సాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మండలంలోని కుచ్చెళ్ళపాడు గ్రామానికి చెందిన రైతులు ఎమ్మెల్యే ఆనందబాబుకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కూచిపూడి లాకుల వద్ద ఇరిగేషన్ శాఖ కార్యాలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే ఆనందబాబును సంబంధిత రైతులు కలుసుకున్నారు. కుచ్చెళ్ళపాడు, ఎల్లబాడు పరిధిలోని 7000వేల ఎకరాలకు చెందిన రైతులకు సాగునీరు అందక నష్టపోతున్నట్లు రైతులు పేర్కొన్నారు. ప్రధానంగా యాటీ ఛానల్‌పై నుంచి వచ్చే పంట నీరు మురుగు నీటిలో కలుస్తుంది. దీని వల్ల పంట నీరు కూడా మురుగునీరుగా మారిపోయి ఆ నీరు పైర్లకు ఉపయోగపడటం లేదు. ఒకే ప్రాంతంలో పై నుంచి సాగునీరు కింద నుంచి మురుగునీరు ప్రవహించే తూములు పూర్తిగా దెబ్బతిన్నాయి. సమీపంలో కల్వర్టులు కూడా లేని కారణంగా కాలువలు గట్లు జారిపోయి ఊడిపోయాయి. దీనిపై గత ప్రభుత్వానికి తాము పెట్టుకున్నా అర్జీలు ఏ మాత్రం ఉపకరించలేదు. ప్రజాప్రతినిధులు కానీ అధికారులు కానీ స్పందించని కారణంగా తాము ఎంతో నష్టపోతున్నామని వివరించారు. అదే విధంగా ఎల్లబాడు వద్ద సాగునీటి కాలువను కూడా మరమ్మతు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రత్యేక నిధులు కేటాయింపు చేసి శాశ్వత పరిష్కారాన్ని చేకూర్చాలని రైతులు కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ఆనందబాబు ఖరీఫ్ సాగు దృష్ట్యా రైతుల సమన్వయంతో తాత్కాలిక మరమ్మతులకు వెంటనే శ్రీకారం చుట్టాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర బడ్జెట్ ప్రకటించిన తరువాత శాఖలకు తగిన రీతిలో నిధులు కేటాయిస్తామని వాటి ద్వారా శాశ్వత పరిష్కార మార్గంగా నిర్మాణం పనులు చేపడతానని రైతులకు హామీ ఇచ్చారు. సర్పంచ్ గాజుల వెంకట సుబ్బయ్య మాజీ సర్పంచ్ తాడికొండ సుధీర్‌బాబు, టిడిపి బిసీ సంఘం నేత తులం రమేష్‌బాబు, పలువురు రైతులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు తక్షణమే పరిష్కరించాలి

● జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్



ప్రజాసమస్యల పరిష్కార వేదికలో అర్జీలు అందుకుంటున్న జేసీ శ్రీధర్

బాపట్ల, జూన్ 24 : ప్రజాసమస్యలు తక్షణమే పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ తెలిపారు. బాపట్ల కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలంటూ వినతిపత్రాల ద్వారా విజ్ఞప్తి చేశారు. తన పరిధిలోని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి పరిధిలో లేని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వచ్చిన అర్జీలన్నీ ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. గతనెలలో ఆన్‌లైన్‌లో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలపై అధికారులు నిర్లిప్తత ప్రదర్శించరాదని చెప్పారు. డయేరియా వ్యాధి వ్యాప్తిని అరికట్టటానికి పరిశుభ్రమైన శుద్ధజలాలను సరఫరా చేయాలని సూచించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్‌గున్యావంటి వాధ్యలు సంక్రమించకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాలుగుసార్లు అర్జీలు పెట్టిన సమస్యల పరిష్కారం కాలేదు

● లఖింశెట్టి నాగలక్ష్మీ దంపతులు

పొలం సమస్య పరిష్కరించాలని కోరుతూ గత ప్రభుత్వంలో నాలుగు సార్లు అర్జీలు పెట్టిన పరిష్కారానికి నోచుకోలేదని పర్చూరు నియోజకవర్గం చెరుకూరు గ్రామానికి చెందిన లఖింశెట్టి నాగలక్ష్మీ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మారింది కాబట్టి ఇప్పుడైన తమ సమస్య పరిష్కారమౌతుందని మరోసారి అర్జీ అందజేసినట్లు ఆవేదనతో తెలియజేశారు.

లంచం ఇవ్వలేదని సర్వేనెంబరు మార్చారు

● సంతరావూరుకు చెందిన సూర్యదేవర సరోజనీ

జిల్లాలోని చినగంజాం మండలం సంతరావూరుకు చెందిన సూర్యదేవర సరోజనీకి చెందిన రెండు ఎకరాల భూమిలో 7సెంట్ల భూమిని సాగర్ కాల్వభూమిగా చూపించి అధికారులు ఇబ్బంది పెడుతున్నట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే రెండుసార్లు స్పందనలో ఫిర్యాదు చేసిన పరిష్కారంకాలేదన్నారు. ప్రభుత్వం మారింది కాబట్టి తమ సమస్య పరిష్కారమౌతుందన్న ఆశతో వచ్చామని తెలిపారు.

వలంటీర్‌గా అవకాశం ఇప్పించి ఆదుకోండి

ఐదేళ్ళపాటు కేవలం 5వేల రూపాయల గౌరవవేతనంతోనే ప్రజలకు సేవలందించిన తమను వైసీపీ నాయకుల రాజకీయ లబ్ధి కోసం రాజీనామా చేయించారని తిరిగి తమకు వలంటీర్లుగా అవకాశం కల్పించాలని వార్డు వలంటీర్లు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జేసీ సీహెచ్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేసినవారు మాట్లాడుతూ కరోన సమయంలో కూడా ప్రాణభయం లేకుండా ప్రజలకు సేవలందించామన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా నిష్పక్షపాతంగా పని చేసిన తమను ఒక పార్టీకి చెందినవారిగా ముద్ర వేసి ఇబ్బందిపెట్టటం సరికాదన్నారు. కేవలం వైసీపీ నాయకుల ఒత్తిడి వల్లే తాము రాజీనామా చేశామన్నారు. కావున అధికారులు స్పందించి తమను తిరిగి వలంటీర్‌లుగా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ వార్డు వలంటీర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

● వ్యకాస జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్

బాపట్ల, జూన్ 24: ఉపాధి కూలీలకు 6వారాలు నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేసి కూలీలకు పని కల్పించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నాయకులు టి.కృష్ణమోహన్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక ద్వారా జేసీ సీహెచ్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. .కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.ఆగస్టీన్, బి.సుబ్బారావు, కె.శరత్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుడితో పాటు డీఎంహెచ్‌వోపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ నేత మురళీకృష్ణ డిమాండ్



వైద్యుడి అకృత్యాలను విచారణ అధికారికి వివరిస్తున్న టీడీపీ నేత మురళీకృష్ణ

కొల్లూరు, జూన్ 24: మహిళా సిబ్బందితో అమానుషంగా ప్రవర్తిస్తున్న వైద్యుడికి వత్తాసు పలికిన డీఎంహెచ్‌వోపై కూడా చర్యలు తీసుకోవాలని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు రవిబాబుపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ డీపీఎంవో రోహిణిరత్నశ్రీ విచ్చేశారు. వైద్యుడి వల్ల వేధింపులకు గురైన మహిళా సిబ్బందిని అంతరంగికంగా విచారణ చేశారు. మొత్తం 38 మంది సిబ్బందిని విచారించగా వారందరూ వైద్యుడు సిబ్బందిని లైంగిక వేధింపులు, అసభ్య పదజాలంతో సందేశాలు పంపుతూ మానసికంగా, శారీరకంగా తమను ఎంతో ఇబ్బందులకు గురి చేశాడని అధికారుల వద్ద వాపోయారు. అతనిపై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు మళ్లీ ఈ వైద్యశాలలో వైద్యుడిగా వేయవద్దంటూ విచారణ అధికారి రోహిణి రత్నశ్రీని ప్రాధేయపడ్డారు. విచారణలో వెల్లడించిన విషయాలన్ని లిఖిత పూర్వకంగా ఇవ్వాలని అధికారి కోరడంతో సిబ్బంది మొత్తం వైద్యుడి అకృత్యాలను లిఖిత పూర్వకంగా ఇవ్వడంతో పాటు వైద్యుడు పంపించిన అసభ్యకర సందేశాలను సైతం విచారణ అధికారులకు చూపించారు. విచారణలో జిల్లా వైద్యాశాఖధికారులు టి.మురళీకృష్ణ, కేవీ రమేష్, సిబ్బంది, స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వోను తక్షణమే సస్పెండ్ చేయాలి

సంవత్సరంపై నుంచి మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపుల కు పాల్పడుతూ వారిని నానా రకాలుగా ఇబ్బందులు పెడుతు న్న వైద్యుని పట్ల ఉదాసీనంగా వ్యవహరించిన డీఎంహెచ్‌వోను తక్షణమే సస్పెండ్ చేయాలని టీడీపీ నేత మైనేని మురళీకృష్ణ విచారణ అధికారులను కోరారు. మైనేని వెంట జనసేన మండల అధ్యక్షుడు బి.చలమయ్య, టీడీపీ నాయకులు గద్దె నాగేశ్వరరావు, గోగినేని వెంకటేష్, మున్నంగి విజయ్, బుర్రి జగన్, ఎడ్ల శ్రీను తదితరులు ఉన్నారు.

చెరువులో చేపలు కూడా అమ్ముకున్నారు

● పోలీసులకు వలివేరు గ్రామస్థుల ఫిర్యాదు

చుండూరు జూన్ 24: గతంలో అధికారంలో ఉన్న పార్టీ గ్రామ నాయకులు చివరికి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న చెరువులోని చేపలను కూడా అక్రమంగా అమ్ముకున్నారంటూ వలివేరు గ్రామస్థులు చుండూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. కేసు వివరాల్లోకి వెళితే వలివేరు గ్రామ పంచాయతీ అనుమతులు పొందకుండా 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చిన్న చెరువులో గ్రామ సర్పంచ్ పందిపాటి ఏసు, సుద్దపల్లి పున్నారావు, మరో నలుగురు కలసి మార్చి 1వ తేదీన చెరువులో రూ.5లక్షలకు పైగా విలువైన చేపలను పట్టుకుని అమ్ముకున్నారు. ఈ విషయంపై గ్రామస్థులు పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీలకు ఫిర్యాదు చేసినా వారు అధికార పార్టీ నాయకులకు తలొగ్గి స్పందించలేదని ఎలాంటి చర్యలు తీసుకోలేదని, దీనికి సంబంధించినటువంటి అన్ని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని ఆ నాయకులు దోచుకున్న సొమ్మును తిరిగి రాబట్టాలంటూ గ్రామస్థులు పోలీసులను ఆశ్రయించారు. చుండూరు పోలీసులు దీనిపై విచారణ చేపడతానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

మండలానికి 2,700 కౌలు రైతు కార్డులు

● తహసీల్దార్ నిర్మలానందబాబా

కర్లపాలెం, జూన్ 24 : మండలంలోని 20పంచాయతీలలో 2,700 కౌలురైతులను గుర్తించాలని 2,700 కార్డులు కేటాయించారని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయాధికారుల ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని కౌలురైతులను గుర్తించాలని అధికారులకు తహసీల్దార్ సూచించారు.

ఎంపీగా తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రమాణస్వీకారం

బాపట్ల, జూన్ 24 : బాపట్ల పార్లమెంట్‌మెంబరుగా తెన్నేటి కృష్ణప్రసాద్ సోమవారం పార్లమెంట్‌లో ప్రమాణస్వీకారం చేశారు. సంస్కృతంలో ప్రమాణ స్వీకారం చేసిన కృష్ణప్రసాద్ బాపట్ల నియోజకవర్గం, దేశ సంక్షేమం కోసం కృషి చేస్తానని ప్రతిజ్ఞ చేశారు. బాపట్ల ప్రజలు తనకు అఖండ మద్దతు తెలిపినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన విజయాన్ని జాతికి అంకితం చేసి ఎన్డీఏ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల విద్యుత్‌సబ్సిడీ కొనసాగించాలి

● బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వరరావు, రాజారావు

బాపట్ల, జూన్ 24 : రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు విద్యుత్ సబ్సిడీ 200 యూనిట్‌ల వరకు ఉండగా 50యూనిట్‌లకే బిల్లులు వస్తున్నాయని బహుజన సమాజ్‌వాదిపార్టీ జిల్లా అధ్యక్షుడు కాగిత కోటేశ్వరరావు, గుదే రాజారావు తెలిపారు. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 400యూనిట్‌ల వరకు ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీని కొనసాగించాలన్నారు. ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్సీ, ఎస్టీలకు షాక్ ఇవ్వటం సరికాదన్నారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించటానికి ఈ విధంగా చేశారని ఆరోపించారు. వెంటనే దీనిపై స్పందించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలన్నారు.

తాగునీటి శాంపిల్స్ సేకరణ

బాపట్ల, జూన్ 24 : బాపట్ల పట్టణంలో సరఫరా చేస్తున్న తాగునీరు 5 రోజులుగా రంగుమారి మురుగువాసనతో వస్తున్నాయని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. దీనిపై స్పందించిన మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసులు సిబ్బందితో కలిసి సోమవారం వార్డులలో పర్యటించి తాగునీటి శాంపిల్స్ సేకరించారు.

వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు ప్రాధాన్యం

● ఎస్పీ వకుల్‌జిందాల్



వృద్ధుల వద్దకే వచ్చి అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల, జూన్ 24: వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి చట్టబద్ధంగా సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు నుంచి స్వయంగా ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 45మంది ఫిర్యాదులు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలన్నారు. ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు స్వయంగా వచ్చి తమ సమస్యలను అర్జీల రూపంలో తెలియజేయవచ్చు అన్నారు. వాటిని చట్టపరిధిలో వేగంగా పరిష్కరిస్తామన్నారు. ఎస్పీ కార్యాలయంలోకి రాలేని వృద్ధుల వద్దకే ఆయన వెళ్లి అర్జీలు స్వీకరించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ టీపీ విఠలేశ్వర్, సీఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు ఐదు అర్జీలు



ఆర్డీవో హేలా షారోన్‌కు సమస్యలను చెప్పుకుంటున్న ప్రజలు

రేపల్లె, జూన్ 24: ప్రజల సమస్యల పరిష్కారం కోసమే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక అని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. సోమవారం నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో ఐదు ఫిర్యాదులు అందాయి. నిజాంపట్నం గ్రామం నందు తన పొలంను ఆన్‌లైన్ చెయ్యవల్సిందిగా కోరుతూ అర్జీ దాఖలు చేశారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి మంజూరైన శ్మశాన వాటికకు హద్దులు నిర్ణయించాల్సిందిగా కోరారు. పట్టణ పరిదిలో తన ఇంటి స్థలాన్ని అక్రమంచి ఇంటి నిర్మాణం జరుగుతుందని ఆనిర్మాణ పనులు నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలంటూ అర్జీ దాఖలు చేశారు. రేపల్లె మండలం బేతపూడి ఏరియా పరిదిలోని పల్లెకూన వెళ్లే రహదారిలో నిర్మించిన ఐస్ ఫ్యాక్టరీ నుంచి వచ్చు వ్యర్థాల వల్ల తమ పొలాల్లో పంట సరిగ్గా పండట్లేదని తక్షణమే ఐస్ ఫ్యాక్టరీని నిలుపుదల చేయాలని అర్జీ దాఖలు చేశారు. ఈ ఫిర్యాదులను సంబంధిత అధికారులకు తెలిపి పరిష్కారం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

మెరిట్ విద్యార్థులకు న్యాయం జరగాలి

● ఇండియా కూటమి బాపట్ల జిల్లాశాఖ డిమాండ్



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ఇండియా కూటమి నాయకులు

బాపట్ల, జూన్ 24: నీట్ పరీక్ష నిర్వాహణ పూర్తిగా విఫలమైందని ఇండియా కూటమి బాపట్ల జిల్లాశాఖ విమర్శించింది. ఈ విషయమై సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేసి జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు. మెరిట్ విద్యార్థులకు న్యాయం జరిగేవిధంగా చూడాలని డిమాండ్ చేశారు. సమాజ్‌వాద్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు మేధా శ్రీనివాసరావు మాట్లాడుతూ 24లక్షల మంది హాజరైన నీట్‌పరీక్ష నిర్వాహణ పూర్తిగా విఫలమైందన్నారు. ముందురోజే పేపర్ లీక్ అయ్యిందని దీనివల్ల 67మందికి నూరుశాతం మార్కులు వచ్చాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం గ్రేస్ మార్కులు రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించగా సగం మంది గైర్హజరయ్యారన్నారు. ఎన్‌టీఏ డైరెక్టర్ ఉద్వాసన, సీబీఐ కేసు రిజిస్ట్రేషన్ విచారణ ప్రారంభం అవకతవకలకు కారణమైన కొంతమంది అరెస్ట్ మొదలైన నష్ట నివారణ చర్యలు ప్రారంభమయ్యాయన్నారు. కావున నీట్ పరీక్షల విధాన నిపుణులు సలహా మేరకు తిరిగి పరీక్ష నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.ఆనందరావు, వీసీకే పార్టీ జిల్లా అధ్యక్షులు రేగులగడ్డ చంద్రశేఖర్, సీపీఎం నాయకులు శరత్, సీపీఐ నాయకులు అజయ్, భీమ్‌ఆర్మీ నాయకులు కొచ్చెర వినయ్‌రాజు, బీసీ నాయకులు మోర్ల చిన వెంకటేశ్వరరావు, కొమ్మనబోయన ఫణేంద్ర, బాలాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న రవీంద్ర బాబు, గిరి, తదితరులు

అమృతలూరు, జూన్ 24: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు చిత్రపటానికి పాలాభిషేకం సోమవారం నిర్వ హించారు. స్థానిక ఉత్తర ఎస్సీకాలనీ పార్కు ఆవరణ యడ్లపల్లి అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో కృతజ్ఞత సభ నిర్వహించారు. అనంత రం క్రొత్తపల్లి రవీంద్రబాబు, శరణు శేషగిరి చేతుల మీదగా చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో అమర్తలూరి ప్రభాకరరావు, వినయ్, స్థానికులు పాల్గొన్నారు.

కేబీపాలెం శ్రీవేంకటేశ్వరస్వామి ప్రథమ వార్షికోత్సవం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర

బాపట్లరూరల్, జూన్ 24: బాపట్ల మండలం కొండుభొట్లపాలెంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవాన్ని గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు జరిపారు. ఈ వేడుకలో బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొని వేంకటేశ్వస్వామివారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేదపండితులు స్వామి వారి తీర్థప్రసాదాలను బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, నామన శివన్నారాయణ, తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు లేని ఇళ్లే అంతఃపురాలు..!

- పాలకులు మారినా.. ప్రభుత్వాలు మారినా మారని షెడ్డు కార్మికుల దీనస్థితి
- ప్రకృతి అవసరం ఎరికైనా ఒక్కటే..

చీరాల, జూన్ 24 : చీరాల మండలం ఈపురుపాలెంలో యువతి రేప్, హత్య రాష్ట్రంలోనే సంచలనం అయింది. బహిర్భూమికి వెళ్లిన యువతిపై మృగాళ్ల సామూహిక దాడి చేసి చంపారు. అయితే ఆ ప్రాంతంలో నివశించే అనేక మంది ఇళ్ల (అద్దెఇల్లు)లో స్నానపు గదులు మాత్రమే ఉన్నాయి. మరుగుదొడ్లు లేవు. స్థితివంతులైన వారు ఇల్లు బాడుగకు తీసుకునేందుకు వారి ఆర్థిక స్థితి సహకరించదు. ఇలా బహిర్భూమికి వెళ్లిన మహిళలు, యువతులు, పిల్లలు తమకు ఎదరయ్యే చేదు అనుభవాలను కనీసం కుటుంబంలో కూడా చర్చించుకోలేక కుమిలిపోతున్నారు.

చీరాల మండలం ఈపురుపాలెం మేజర్ పంచాయతీ. చేనేతకు పుట్టిల్లు. సుమారు 25వేల పైచిలుకు జనాభా ఉంటారు. అందులో సింహభాగం చేనేత, దాని అనుబంధ వృత్తులపై ఆధారపడి జీవిస్తుంటారు. వీరిలో షెడ్ కార్మికులు, నిరుపేదలు అనేక మంది ఉన్నారు. వారికి కనీసం సొంతిల్లు కూడా ఉండదు. అద్దె ఇళ్లే వారి అంతఃపురాలు. ఆ ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. కేవలం స్నానపు గదులు మాత్రమే ఉంటాయి. ఆ ఇళ్లకు సంబంధించి మగ, ఆడ లేకుండా ప్రకృతి అవసరాలు తీర్చుకునేందుకు బహిర్భూమికి వెళ్లాల్సిందే.



మగ్గం పని, వంట, భోజనం, పడక అన్నీ ఒకే గదిలో.. ఈపురుపాలెంలో చేనేత కార్మికులు అద్దెకు ఉంటున్న గది.. షెడ్ కార్మికుల స్నానాల గది

అలాంటి సందర్భాల్లో చేదు అనుభవాలు ఎదుర్కొన్న వారూ ఉన్నారు.

మారని పేదల స్థితిగతులు

పాలకులు మారినా ... ప్రభుత్వాలు మారినా తమ బతుకులు మారడం లేదని సొంతిల్లు కూడాలేని నేతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఇరుకు గది వారి అంతఃపురం. అందులోనే మగ్గంను ఏర్పాటు చేసుకుంటారు. అక్కడే వంట చేసుకోవాలి. అక్కడే భోజనం చేయాలి. అక్కడే నిద్రపోవాలి. ఇది ఎంత కష్టమో పాలకులు, అధికారులు అర్థం చేసుకుని కనీస వసతులు కల్పించాల్సిన అవసరం ఉంది.

గంజాయి మూకలను చూస్తే భయం

గంజాయి మూకలను చూస్తే అక్కడి వారికి భయం. రెక్కడితేగానీ డొక్కాడని బడుగు జీవులు కావడం అందుకు కారణం. హత్యాచారాలకు గురైన యువతి కుటుంబం కూడా గూడూరు సమీపంలోని ఇందూరు నుంచి 8 సంవత్సరాల కిందట ఇక్కడకు వలస వచ్చారు. ఆ ప్రాంతంలో ఇలాంటి కుటుంబాలు అనేకం ఉన్నాయి. వారందరూ అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు. ఆ ఇళ్లల్లో మరుగుదొడ్లు ఉండవు. బాలికల పాఠశాల ప్రహరీ గోడపై గంజాయి గ్యాంగ్ అప్పుడప్పుడూ కనిపిస్తుంటారని వారంటే తమకు భయమని ఆ ప్రాంతంలో చెప్పుకుంటున్నారు. దీనికి సంబంధించి పోలీస్ ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

ఆరుబయటకు పోవడం ఎవరికి మాత్రం ఇష్టం



ఇక్కడ అద్దె ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. కేవలం స్నానపు గది మాత్రమే ఉంటుంది. మహిళలకు ఎవరికైనా కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఆరుబయటలకు వెళ్లడం ఇష్టం ఉండదు. తప్పని పరిస్థితి. ఇక్కడ వారి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించి కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.

- సరస్వతి, చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం

వసతులు కల్పించాలి



మాకు నలుగురు బిడ్డలు. నలుగురు ఆడపిల్లలే. ఇద్దరు ఎదిగిన బిడ్డలు. ఇద్దరు చిన్నవాళ్లు. వారిని కడుపులో పెట్టుకుని కాపాడుకోవాల్సిన పరిస్థితి. మేం ఉండే ఇళ్లకు మరుగుదొడ్లు ఉండవు. అనివార్యంగా వెలుపలకు వెళ్లాలి. ఎప్పుడు ఏ పరిస్థిత ఉంటుందో చెప్పలేం. ఇప్పుడు జరిగిన సంఘటన చూశారుగా. ఇప్పటికైనా పాలకులు, అధికారులు మాకు కనీస వసతులు కల్పించాలని కోరుతున్నాం.

- పుణ్యవతి, చేనేత కార్మికురాలు, ఈపురుపాలెం



సమావేశంలో పాల్గొన్న మంత్రి గొట్టిపాటి

మంత్రి మండలి సమావేశంలో గొట్టిపాటి

అద్దంకి, జూన్ 24 : టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత జరిగిన తొలిమంత్రి మండలి సమావేశానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. వరుసగా ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన గొట్టిపాటి రవికుమార్ చంద్రబాబు మంత్రి మండలి స్థానం పొందారు. ఇటీవల విద్యుత్ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన రవికుమార్ సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి మండలి సమావేశంలో పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపండి



సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో

పంగులూరు, జూన్ 24 : గ్రామాలలో అంటు వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంపీడీవో మ్యాత్యూబాబు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం డయేరియా, పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలలో క్లోరినేషన్, ఓహెచ్ఎస్ఆర్‌లు శుభ్రపరచడం, క్లోరోస్కోప్‌ల సేకరణ, డ్రైడే, స్వచ్ఛ సంకల్ప కార్యక్రమాలన్నీ పంచాయతీల పరిధిలో విధిగా చేపట్టాలన్నారు. ప్రజలు వినియోగించే తాగునీటిని టెస్ట్ చేసి రిపోర్ట్ అందచేయాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో ఈవోఆర్డీ రాంబాబు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు రాత పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలను అందజేస్తున్న సభ్యులు

చినగంజాం, జూన్ 24 : మండలంలోని పెదగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి వారు సోమవారం రాత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వివేకానంద సేవా సమితి కార్యదర్శి పావులూరి శివాజీ మాట్లాడుతూ బాలబాలికలు విద్యాభివృద్ధి చెంది ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. గత పది సంవత్సరాలుగా ఈ పాఠశాలలోని విద్యార్థులకు సహకారం అందిస్తున్నామని అన్నారు. పాఠశాలలోని 1వ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు పలకలు, రాతపుస్తకాలు, స్టేషనరీలను సమితి సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎంటీవీఎస్ శైలజకుమారి, ఉపాధ్యాయిని బి.సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్త ఐ.శివకుమారి, ఉప్పుగుండూరు వివేకానంద సేవా సమితి సభ్యులు మాచవరపు చిరంజీవి, ఏఎన్‌ఎం కే.రమాదేవి పాల్గొన్నారు.

ఉపాధి పనులను కల్పించాలి

అద్దంకిటౌన్, మే 24: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో పది రోజుల నుంచి ఉపాధి హామీ పనులు నిలిపివేశారని, వ్యవసాయ కార్మికులకు వెంటనే పనులు అప్పగించి ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకలు ఎంపీడీవో జీవీ సత్యనారాయణను కలిసి సోమవారం వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏటా వంద రోజుల పని దినాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న కూలీల బకాయిలను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీడీవో సత్యనారాయణ మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో సందర్శించి ఉపాధి హామీ పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని, బకాయిల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పొనకా రామాంజనేయులు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొమరగిరి హనుమంతరావు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలపై దృష్టి సారించాలి

చినగంజాం, జూన్ 24 : బడిఈడు పిల్లలు బయట లేకుండా పాఠశాలలో చేర్పించేలా దృష్టిసారించి, చర్యలు చేపట్టాలని జిల్లా సమగ్ర శిక్ష సెక్టోరల్ ఆఫీసర్స్ సీఎంవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల విద్యా వనరుల కేంద్రంలో నేను బడికి పోతా కార్యక్రమం పర్యవేక్షణలో భాగంగా మండల విద్యాశాఖాధికారి బీ అజయ్‌బాబు అధ్యక్షతన సీఆర్ఎంటీలు, కార్యాలయ సిబ్బందితో న్యూ ఎన్‌రోల్‌మెంట్, బడి బయట పిల్లల వివరాలు, స్టూడెంట్ కిట్ల పంపిణీపై సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. బడి బయట పిల్లలు లేకుండా పాఠశాలల్లో వంద శాతం నమోదు లక్ష్యంగా పని చేయాలని సీఎంవో ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. మండల పరిధిలో స్టూడెంట్ కిట్ల పంపిణీ వివరాలను ఎంఈవోని అడిగి తెలుసుకున్నారు. నేను బడికి పోతా కార్యక్రమంపై సిబ్బందికి ఆయన పలు సూచన లు అందజేశారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ సత్యసాగర్, సీఆర్ఎంటీలు సురేంద్రకుమార్, సునీల్, రామకృష్ణారెడ్డి, ఆశీష్‌కుమార్, ఎంఐఎస్ మాజేటి మురళి, కంప్యూటర్ ఆపరేటర్ రాజు మురళీకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

డయేరియా, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

అద్దంకిటౌన్, మే 24 : రానున్న రెండు నెలల్లో గ్రామాల్లో డయేరియా, పారిశుధ్యం, తాగునీటి వల్ల వచ్చే వ్యాధులు రాకుండా ప్రత్యేక దృష్టి పెట్టి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ ఆదేశించారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఆర్‌డబ్ల్యూఎస్, ఈవోఆర్‌డీ హెల్త్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో 15 రోజులకోసారి వాటర్ ట్యాంక్‌లు శుభ్రం చేయించాలని, పైపులైన్లు లీక్‌లు లేకుండా చూడాలన్నారు. ట్యాంక్‌కు నీటిని నింపిన ప్రతి సారి క్లోరినేషన్ చేయాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాలల్లో ఆయిల్ బాల్స్ వేయాలని, దోమలు వ్యాప్తి చేందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లోని ఆరోగ్య కార్యకర్తల సమన్వయంతో ఎక్కడ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూ చించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ బీ హనుమంతరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇన్‌చార్జి ఏఈ పీ అనూష పాల్గొన్నారు.

కిరాతకులను కఠినంగా శిక్షించాలి

ఆర్యవైశ్యుల డిమాండ్

చీరాలటౌన్, జూన్ 24 : కంచర్ల సంతోష్‌ను హత్య చేసిన కిరాతకులను కఠినంగా శిక్షించాలని పలువురు ఆర్య వైశ్య ప్రముఖులు డిమాండ్ చేశారు. ఆదివారం సతీష్‌ను హత మార్చిన ఘటనను నిరసిస్తు సోమవారం ర్యాలీ నిర్వహించారు. అంతేకాకుండా సాయంత్రం నుంచి మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్‌ను స్వచ్ఛందంగా మూసివేశారు. వన్‌టౌన్ సీఐకి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ చిన్నపాటి వివాదాన్ని సర్దుకోకుండా కసిగా దాడి చేసి హత్య చేసినట్లు చెప్పారు. ఇటువంటి ఘటనలకు పాల్పడే వారిని బయటకు రానియ్యకుండా శిక్షించాలని డిమాండ్ చేశారు. తులాబంధు సురేష్, చిన్ని లీలాధరరావు, శ్రీనివాసరావు, చంద్రశేఖరరావు, వేణు, సుబ్బయ్య, చీమకుర్తి బాలకృష్ణ, గుంటూరు ప్రభాకరరావు, వెంకటేశ్వర్లు, గజవల్లి శ్రీను, రఘు, మధు, అనీల్, రమణ, బ్రహ్మం, వేణుగోపాల్, బాలు, అమరా శివ పాల్గొన్నారు.




పోలేరమ్మతల్లి విద్యుత్ ప్రభ

వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

బల్లికురవ, జూన్ 24 : మండలంలోని గుంటుపల్లిలో సోమవారం పోలేరమ్మ తిరునాళ్ల వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మా దాల వీరమ్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించా రు. ఈ సందర్భంగా రాత్రికి విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్య క్రమాలను నిర్వహించారు. పలు గ్రామాల నుంచి భక్తులు పాల్గొన్నారు.

లోకేష్‌కు గరటయ్య శుభాకాంక్షలు



లోకేష్‌కు బొకే ఇచ్చి అభినందిస్తున్న గరటయ్య

అద్దంకి, జూన్ 24 : రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, విద్య, ఆర్‌టీజీ, హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రిగా సోమవారం బాధ్యతలు చేపట్టిన లోకేష్‌ను మాజీ ఎమ్మెల్యే, బాపట్ల పార్లమెంట్ ఎన్నికల కోఆర్డినేటర్ బాచిన చెంచుగరటయ్య కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రాధాన్యతాక్రమంలో సమస్యల పరిష్కారం

ఎమ్మెల్యే కొండయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 24 : ప్రాధాన్యతాక్రమంలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 8వ వార్డు ఎల్‌బీఎస్‌నగర్‌లోని జెండా చెట్టు వద్ద ఆయన అభిమానులు మొక్కుతీర్చుకునే కార్యక్రమంలో కొండయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కొండయ్య మాట్లాడుతూ స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఎమ్మెల్యే కొండయ్యకు శుభాకాంక్షలు, అభినందనలు తెలిపేందుకు పోటీ పడ్డారు. అనంతరం డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని, మసీదుకు ప్రహరీ నిర్మించాలని, దోమల బెడదను నివారించాలని కోరారు. దీనిపై కొండయ్య సానుకూలంగా స్పందించారు. అందరినీ పేరు, పేరు పలకరిస్తూ ఎన్నికల ప్రచారంలో పని చేసినవారిని ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ ఇలియాజ్, సయ్యద్‌బాబు, షేక్ జమీర్, షేక్ ఖలీమ్, సయ్యద్‌రియాజ్, షేక్ మస్తానమ్మ, సజ్జా వెంకటేశ్వరరావు, డేటా నాగేశ్వరరావు, ఉసురుపాటి సురేష్, స్థానికులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అంతకు ముందు పార్టీ కార్యాలయంలో పలువురు విభిన్న ప్రతిభావంతులు తమ సమస్యలు పరిష్కారం కోరుతూ ఎమ్మెల్యేకి వినతిపత్రం ఇచ్చారు. వడ్డెర సంఘం రాష్ట్ర ప్రతినిధులు, జిల్లా బాధ్యులు ఎమ్మెల్యే కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

27న ప్రవేశ పరీక్ష

అద్దంకిటౌన్, మే 24: అద్దంకిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలోని 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 6, 7, 9 తరగతులల్లో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాయత్రిదేవి సోమవారం ప్రకటన తెలిపారు. 6వ తరగతిలో ఎస్సీ 4, ఎస్టీ 2, బీసీ 1 ఖాళీలు ఉన్నాయన్నారు. అలాగే 7వ తరగతిలో ఎస్సీ 2, బీసీ 2, ఓసీ 1, 9వ తరగతిలో ఎస్టీ 2 సీట్లు ఉన్నాయని, ఆసక్తి కలిగిన విద్యార్థినులు ఈ నెల 26వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని 27వ తేదీన గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఆమె తెలిపారు.

నక్కలపాలెంలో నేత్రదానం

ఇంకొల్లు, జూన్ 24 : మండలంలోని పెదనక్కలపాలెంలో నేత్రాలను దానం చేశారు. గ్రామానికి చెందిన కామేపల్లి రత్తమ్మ(65) మృతి చెందగా, సోమవారం నేత్రాలను దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు రత్తమ్మ నేత్రాలను సేకరించారు. నేత్ర దానానికి సహకరించిన కుటుంబసభ్యులు వెంకటేశ్వర్లు, మారుతీరావు,లక్ష్మిని రోటరీ అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి స్వామి అభినందించారు.

సీసీ కెమెరాలను బాగుచేయాలి

ఇంకొల్లు, జూన్ 24 : ఇంకొల్లులో గతంలో దాతల సహకారంతో పోలీసులు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు సరిగ్గా పనిచేయడం లేదు. వీటిని వెంటనే పని చేసేలా చర్యలు తీసుకొని నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాత్రి వేళల్లో నిఘా పెంచాలని ప్రజలు కోరుకుంటున్నారు. సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో వాహనదారులు సైతం ట్రాఫిక్ రూల్స్ పాటించడం లేదు. కెమెరాలను బాగు చేయించాలని కోరారు.

బండ్లమాంబ తిరునాళ్ల ప్రారంభం

నాగండ్ల(ఇంకొల్లు), జూన్ 24 : ఇంకొల్లు మండలంలోని నాగండ్ల గ్రామంలోని బండ్లమాంబ 27వ వార్షికోత్సవ తిరునాళ్ల సోమవారం ప్రారంభమైంది. తొలిరోజు గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి పొంగళ్లు నైవేద్యాలు చెల్లించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ల బుధవారం అత్యంత వైభవంగా జరపనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

7న మాదిగ జనజాతర సభ

అద్దంకిటౌన్, మే 24 : ఈదుమూడి గ్రామంలో జూలై 7వ తేదీన జరిగే మాదిగ జన జాతర కార్యక్రమానికి మాదిగలందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆలూరి చిరంజీవి మాదిగ కోరారు. సోమవారం అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద జనజాతరకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఎఫ్ గంగాధర్, ఎంఆర్‌పీఎస్ నాయకులలు ఎలీషా పాల్గొన్నారు.



రాజా మృతదేహనికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

రాజా మృతి టీడీపీకి తీరనిలోటు

చినగంజాం, జూన్ 24 : చినగంజాం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, చినగంజాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తాటి రాజశేఖర్ (63) వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారు. రాజశేఖర్ మృతదేహనికి టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజా మృతి పార్టీకి తీరని లోటుని టీడీపీ మండలాధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. పార్టీ అప్పగించిన ఏ బాధ్యతనైనా జాగ్రత్తగా నిర్వహించేవారని గుర్తు చేశారు. టీడీపీ నాయకులు పొదవీరయ్య యార్లగడ్డ లక్ష్మి, టీ.జయరావు, సందు శ్రీనివాసరావు, ధర్మవరపు ఏసునారాయణ, షేక్ జిలాని, నరహరి శ్రీనివాసరావు, దేవతోటి నాగరాజు, గంటా వెంకటనారాయణ, టి.వెంకటేశ్వరరావు, జినరసింహారావు తదితరులు నివాళులర్పించినవారిలో ఉన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతిని తెలిపారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.విజయభాస్కరరావు, సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రాజశేఖర్‌కు భార్య శాంతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె నేహా అమెరికాలో ఉన్నందున అంత్యక్రియలు బుధవారం నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



మొక్కు తీర్చుకుంటున్న దగ్గుబాడు టీడీపీ శ్రేణులు

అజ్మీర్ దర్గాలో టీడీపీ శ్రేణులు

దగ్గుబాడు(పర్చూరు), జూన్ 24: రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీర్ దర్గాలో కారంచేడు మండలం దగ్గుబాడు గ్రామానికి చెందిన టీడీపీ ముస్లింలు సోమవారం మొక్కులు తీర్చుకున్నారు. పర్చూరు ఎమ్మెల్యేగా ఏలూరి సాంబశివరావు హ్యాట్రిక్ విజయం సాధించడం, టీడీపీ అధికారంలోకి రావడంతో కోఆప్షన్ మాజీ సభ్యుడు షేక్ ఖాశీం ఆధర్వంలో ముస్లింలు అజ్మీర్ దర్గాకు వెళ్లి మొక్కు తీర్చుకున్నట్లు తెలిపారు.

వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



శేషవాహనంపై ఊరేగుతున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి

మేదరమెట్ల, జూన్ 24 : మేదరమెట్లలో వేయించేసి ఉన్న శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి 40వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఆదివారం రాత్రి అంకురార్పణతో మొదలయ్యాయి. సోమవారం వేకువ జామునే స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు అష్టదళపద్మారాధన నిర్వహించారు. అనంతరం హోమం, శ్రీచక్రపూజ, పండితులు నారాయణం బాలసుబ్రహ్మణ్యం, హైగ్రీవచార్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం శేషవాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ నిర్వహకులు పాదర్తి కాజారావు, మద్దాళి సంజీవరావు, ఆదూరి ప్రసాద్ దంపతులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

550 మందికి ఉచిత పరీక్షలు

మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన

మార్టూరు, జూన్ 24 : మార్టూరులో రాయల్ జూనియర్ కాలేజీ ఆవరణలో రోటరీ క్లబ్ ఆఫ్ మార్టూరు, పంగులూరు, ఇంకొల్లు వారి సౌజన్యంతో ఏర్పాటుచేసిన మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని ఐఆర్ఎస్ లక్ష్మి సుజిత ప్రారంభించారు. దాదాపుగా 550 మందికి పైగా ప్రజానీకం మెగా వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకున్నారు. అదేవిధంగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్న 55 మందిని గుర్తించి వారికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అంతేగాకుండా గుండె పరీక్షలు, ఈసీజీ, పళ్లు, చర్మ వ్యాధులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశామన్నారు. అనంతరం శిబిరానికి వచ్చిన ప్రజానీకానికి భోజన సదుపాయాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్యులు చిగురుపాటి రామారావు ముద్దన సతీష్, బొల్లినేని శిరీష డాక్టరు సుప్రజ మల్లారెడ్డి కేన్సర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ హైదరాబాద్ వారికి రోటరీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సహకరించిన వీరగంధం శ్రీనివాసరావు భవానీ దంపతులకు రోటరీ అధ్యక్షులు తాళ్లూరి సాంబ శివరావు, ఇంకొల్లు అధ్యక్షుడు కమలేశ్వరరావు, పంగులూరు రోటరీ సెక్రటరీ కాలేషావలి ఇంకా చెన్నుపాటి బసవరాములు, జాష్టి వెంకట మోహనరావు, కొర్రపాటి కాజారావు, ఇంటూరి ఆంజనేయులు, షేక్ కాజాహుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణ గ్రామంలో గడ్డివాములు దగ్ధం

రూ.6లక్షలకుపైగా ఆస్తి నష్టం



దగ్ధమవుతున్న వాములు

స్వర్ణ (పర్చూరు), జూన్ 24 : కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో అగ్ని ప్రమాదంలో గడ్డి వాములు దగ్ధమైన సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామంలోని జి.సురేంద్రబాబు అనే రైతుకు చెందిన 60 ఎకరాల్లోని రూ.6లక్షల విలువ చేసే గడ్డివాములు మంటలకు దగ్ధమయ్యాయి. అర్ధరాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగి వాములు దగ్ధం కావడంతో గ్రామస్థులు చీరాల అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. దీంతో సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి కారణాలు తెలియలేదు.